మన
# నేషనలిస్ట్ వాయిస్
తెలుగు దిన పత్రిక
RNI : TGTEL/25/A4284
www.manananationalistvoice.com epaper.manananationalistvoice.com
ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సంపుటి : 01 సంచిక : 100 06 శుక్రవారం ,మార్చి 2026 పేజీలు :12 వెల: రూ. 3/-
హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి, ఆదిలాబాద్, మెదక్, నల్గొండ, మహబూబ్ నగర్, ఖమ్మం, విజయవాడ, గుంటూరు, అమరావతి, క్రిష్ణ, గోదావరి, కర్నూలు, చిత్తూరు, కడప, ప్రకాశం, శ్రీకాకుళం

రిపోర్టర్లు కావలెను
మన నేషనలిస్ట్ వాయిస్ తెలుగు దిన పత్రిక
తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.
తెలుగు రాష్ట్రాలలో సంచనాలు సృష్టిస్తున్న నేషనలిస్ట్ వాయిస్ మీకు సరైన వేదిక.. అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పింస్తోంది. రిపోర్టర్లు కావాలి.
ఇంకెందుకు ఆలస్యం...
9666023180.8096660656 నంబర్లకు వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.

## స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

ముంబై,మార్చి5 మన నేషనలిస్ట్ వాయిస్



ఇరాన్ యుద్ధం కారణంగా బంగారం ధరలు భారీగా పతనం అవుతున్నాయి. రోజురోజుకు తగ్గుతూ ఉన్నాయి. తాజాగా దేశీయ మార్కెట్‌లో పసిడి, వెండి ధరలు భారీగా పడిపోయాయి. గురువారం ఉదయం 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.980 తగ్గి.. రూ.1,63,530 వద్ద ట్రేడ్ అవుతోంది.

వివరాలు 2లో

## ఇరాన్ యుద్ధంతో చిక్కుకున్న భారతీయులు

### గల్ఫ్‌లో 23 వేల మంది చిక్కకున్నట్లు కథనాలు

న్యూఢిల్లీ,మార్చి5 మన నేషనలిస్ట్ వాయిస్

ఇరాన్ యుద్ధం నేపథ్యంలో గల్ఫ్ ప్రాంతంలో 23 వేల మంది భారతీయులు చిక్కుకుపోయినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇరాన్ అణు కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తూ ఇజ్రాయెల్, అమెరికా దేశాలు దాడులకు దిగడంతో మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతలు చెలరేగిన విషయం తెలిసిందే.

వివరాలు 2లో

## బెంగాల్ గవర్నర్ ఆనందబోస్ రాజీనామా

### రాజకీయ ఒత్తిళ్లు కారణమై ఉండొచ్చన్న మమత




కోల్‌కతా,మార్చి5 మన నేషనలిస్ట్ వాయిస్

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్రంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆ రాష్ట్ర గవర్నర్ సీవీ ఆనంద బోస్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ విషయాన్ని పశ్చిమ బెంగాల్ లోక్ భవన్ వర్గాలు వెల్లడించాయి.

వివరాలు 2లో

## ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ

- దిగుమతుల సుంకాలను తిరిగి చెల్లించాల్సిందే
- అమెరికన్ ట్రేడ్ కోర్టు తీర్పు



వాషింగ్టన్,మార్చి5 మన నేషనలిస్ట్ వాయిస్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. దిగుమతులపై విధించిన సుంకాలను తిరిగి చెల్లించాల్సిందేనని ట్రేడ్ కోర్టు తీర్పు ఇచ్చింది. ఇటీవల 1977 అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం కింద ట్రంప్ విధించిన భారీ టారిఫ్‌లను సుప్రీం కోర్టు రద్దు చేసింది. ఇకపై ఈ టారిఫ్‌ల వసూళ్లు నిలిపివేయాలని కోర్టు అధికారులకు ఆదేశించింది. అయితే, ఇప్పటికే వసూలు చేసిన సుంకాలను తిరిగి ఇవ్వాలా లేదా అన్న అంశంపై స్పష్టత ఇవ్వలేదు. తాజాగా ట్రేడ్ కోర్టు తీర్పుతో ఆ విషయంపై స్పష్టత వచ్చింది. అట్మస్ ఫిల్ట్రేషన్ అనే సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి రిచర్డ్ ఈటన్, ఈ సుంకాలు చెల్లించిన దిగుమతిదారులు రీఫండ్ పొందేందుకు అర్హులని పేర్కొన్నారు.


## 2027 కల్లా నాంపల్లి స్టేషన్ ఆధునీకరణ

- కిషన్ రెడ్డి వెల్లడి



02

## దేశంలో తగ్గుతున్న ఫర్టిలిటీ రేటు



- రాష్ట్రంలో ఏటా 6.70 లక్షల జననాలు నమోదు
- 2047 నాటికి జనాభాలో 23 శాతం మంది వృద్ధులు
- ఫర్టిలిటీ సమస్యలతో బాధపడేవారికి ప్రభుత్వం ప్రోత్సాహం
- కుటుంబ నియంత్రణ నుంచి జనాభా పెరుగదల లక్ష్యం
- పాపులేషన్ పాలసీపై చర్చ జరగాలి
- అసెంబ్లీలో డ్రాఫ్ట్ ప్రవేశ పెట్టిన సిఎం చంద్రబాబు

02

## ఘనంగా భట్టి తనయుడి వివాహం

### సిఎం రేవంత్ తదితర ప్రముఖుల హాజరు

హైదరాబాద్,మార్చి5 మన నేషనలిస్ట్ వాయిస్

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారి కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహం వైభవంగా జరిగింది. శంషాబాద్ లో జరిగిన వివాహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వారిని అభినందించారు. గవర్నర్ విజ్ణుదేవ్ వర్మ, నటుడు చిరంజీవి తదితర ప్రముఖులు కూడా వివాహ వేడుకకు హాజరయ్యారు. పలువురు మంత్రులు, మాజీమంత్రులు కూడా హాజరయ్యారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కూడా సూర్య విక్రమాదిత్య వివాహానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి పలువురు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. బంధుమిత్రుల సమక్షంలో భారీ జనసందోహం మధ్య వీరి వివాహం ఘనంగా జరిగింది.



## నేటి నుంచి 99 రోజుల ప్రజాపాలన

### ప్రత్యేక లోగో ఆవిష్కరించిన ప్రభుత్వం

హైదరాబాద్,మార్చి5 మన నేషనలిస్ట్ వాయిస్




99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లోగోను ప్రభుత్వం ఆవిష్కరించింది. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగనున్నారు. మార్చి 6 నుంచి ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుజిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక నిర్వహణపై జిల్లా కలెక్టర్లకు ఇటీవలే సిఎం నిర్దేశం చేశారు.

వివరాలు 2లో

## రాజ్యసభ అభ్యర్థులుగా సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి

చివరి రోజు కావడంతో ఇద్దరూ నామినేషన్ల దాఖలు

సిఎం రేవంత్, మంత్రులు, ఎమ్మెల్యేల రాకతో కోలాహలం



02

## మూసీ పేరుతో కాంగ్రెస్ దోపిడీ



- మురుగు శుద్ధి కేంద్రాలపై అశ్రద్ధ
- కాంగ్రెస్‌ది విధ్వంస పాలన
- నాగోల్ సమీపంలో మూసీని పరిశీలించిన కెటిఆర్ బృందం

02

## రాజ్యసభకు నితీశ్ నామినేషన్

హాజరైన కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా



02

మొదటిపేజీ తరువాయి

# నేటి నుంచి 99 రోజుల ప్రజాపాలన

మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు ప్రజా పాలన..ప్రగతి ప్రణాళిక అయిదు దశల్లో కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టే ఈ కార్యక్రమ నిర్వహణపై ఉమ్మడి జిల్లా కేంద్రంలో జిల్లా ఇన్చార్జి మంత్రితో సన్నాహక సమావేశం ఏర్పాటు చేసి, ఈ సమావేశానికి జిల్లాలోని ప్రముఖ ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని తెలిపారు. ఈనెల 12 వ తేదీన ఆయా జిల్లాల్లో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్లు, మేయర్లు, వార్డు కౌన్సిలర్లు, కార్పొరేటర్లు , సర్పంచులకు అవగాహనా సదస్సులు నిర్వహించాలని అన్నారు. ఇందుకుగాను పంచాయితీ రాజ్, మున్సిపల్ శాఖలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తాయని అన్నారు. ఈ 99 రోజుల ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక కార్యక్రమం గ్రామ, మండల, నియోజక వర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించడం జరుగుతుందని మరోసారి తెలిపారు. దీనికి సంబంధించి ఎప్పటికప్పుడు తగు మార్గ దర్శకాలను జారీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

# బెంగాల్ గవర్నర్ ఆనందబోస్ రాజీనామా

అయితే, ఆయన రాజీనామాకు గల స్పష్టమైన కారణాలు తెలియరాలేదు. సీవీ ఆనంద బోస్ రాజీనామాపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ స్పందించారు. ఆయన రాజీనామా విషయం తెలిసి తాను షాకయ్యానని చెప్పారు. 'గవర్నర్ రాజీనామాకు గల కారణం ప్రస్తుతానికి నాకు కూడా తెలియదు. ప్రస్తుత పరిస్థితుల్ని చూస్తుంటే నాకేమీ ఆశ్చర్యం అనిపించడం లేదు. త్వరలో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర మంత్రి నుంచి ఆయన మీద రాజకీయపరమైన ఒత్తిడి ఉండొచ్చు. కొత్త గవర్నర్‌గా తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవిని నియమిస్తున్నట్లు కేంద్ర మంత్రి నుంచి సమాచారం అందింది. గవర్నర్ తొలగింపు, కొత్త గవర్నర్ నియామకంలో కేంద్ర మంత్రి నన్ను సంప్రదించలేదు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. సహకార విధానానికి కేంద్రం తగిన గౌరవం, ప్రాధాన్యం ఇవ్వాలి. రాష్ట్రాల గౌరవాన్ని కాపాడాలని మమత వ్యాఖ్యానించారు. ఇక.. గవర్నర్‌గా రాజీనామా చేసిన సీవీ ఆనంద బోస్ పశ్చిమ బెంగాల్‌లో మూడున్నరేళ్లు సేవలందించారు. ఆయనకు, సీఎం మమతా బెనర్జీకి మధ్య అనేక విభేధాలు తలెత్తాయి. అందువల్లే గవర్నర్ల వ్యవస్థను మమత తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆనంద బోస్ ప్రస్తుతం ఢిల్లీలోనే ఉన్నారు. ఆయన కేంద్ర మంత్రుల్ని తన రాజీనామా విషయంపై సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు త్వరలోనే నోటిఫికేషన్ వెలువడనుంది.

మొదటిపేజీ తరువాయి

# ఇరాన్ యుద్ధంతో చిక్కుకున్న భారతీయులు

ఈ క్రమంలో హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసి వేసింది. ఆ జలాల్లో ప్రయాణించే నౌకలపై దాడులు తప్పవని హెచ్చరించింది. దీంతో, ముడి చమురు రవాణాకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి.ఇప్పటికే ఆ ప్రాంతంలో ఉన్న పలు ఆయిల్ ట్యాంకర్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఆయిల్ ట్యాంకర్‌లపై జరిగిన దాడుల్లో కొందరు మరణించారు. వీరిలో ఇద్దరు భారతీయులు ఉన్నట్టు కూడా వెలుగులోకి వచ్చింది. ఇక భారత్ జెండాలతో ప్రయాణిస్తున్న 36 నౌకలు కూడా అక్కడి జలాల్లో నిలిచిపోయాయి. వీటిల్లో అధిక శాతం ముడి చమురు రవాణా నౌకలేనని తెలుస్తోంది. వీటితో పాటు కొన్ని కమర్షియల్ కార్గో, ఎల్‌పీజీ గ్యాస్‌ను తరలించే నౌకలు కూడా ఉన్నాయి. ఏడు నౌకలను స్వయంగా ప్రభుత్వ రంగ షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్నట్టు సమాచారం. హోర్ముజ్ జలసంధికి పశ్చిమాన ఉన్న పర్షియన్ గల్ఫ్ జలాల్లో భారత్ జెండాలు ఉన్న 12 నౌకలు, తూర్పు వైపున ఉన్న గల్ఫ్ ఆఫ్ ఒమాన్ జలాల్లో మరో 24 నౌకలు ఉన్నట్టు తెలుస్తోంది. మరోవైపు, సౌదీ అరేబియాకు సమీపంలోని ఎర్రసముద్రంలో భారత జెండాలున్న నౌకలు లేవని సమాచారం. రెండు నౌకలు మాత్రం ప్రస్తుతం గల్ఫ్ ఆఫ్ ఏడెన్ జలాలను దాటుతున్నాయట. ఈ నౌకల్లో సుమారు 1,074 మంది భారతీయులు ఉన్నారట.యుద్ధ వాతావరణం నెలకొన్న ప్రాంతాల్లో పరిస్థితిని భారత ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోంది. ఆయా ప్రాంతాల్లోని నౌకలను జాగ్రత్తగా గమనిస్తోంది. అక్కడ ఇరుక్కుపోయిన భారతీయ సిబ్బందితో చర్చిస్తోంది. భారతీయ జెండాలు, సిబ్బంది ఉన్న నౌకల భద్రత కోసం పలు చర్యలు తీసుకుంటోంది. ఈ దిశగా మంగళవారం కేంద్ర షిప్పింగ్ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

మొదటిపేజీ తరువాయి

## 8నుంచి ఉమెన్ హాకీ కప్ టోర్నమెంట్

## అన్ని ఏర్పాట్లు చేసినట్లు మంత్రి వెల్లడి

హైదరాబాద్,మార్చి5 మన నేషనలిస్ట్ వాయిస్

ఈ నెల 8 నుండి గచ్చిబౌలి హాకీ స్టేడియం లో నిర్వహిస్తున్న ఉమెన్ వరల్డ్ హాకీ కప్ -2026 క్వాలిఫైయింగ్ టోర్నమెంట్ కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని రాష్ట క్రీడా, యువజన సర్వీసులు, పశు సంవర్ధక, మత్స్య శాఖా మంత్రివర్యులు వాకిటి శ్రీహరి వెల్లడించారు. రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ చైర్మన్ కె శివ సేనా రెడ్డి, సోని బాల మాయాదేవి, ఇతర క్రీడాధికారులు పాల్గొన్నారు. గ్లోబల్ సిటీగా గుర్తింపు పొందుతున్న హైదరాబాద్ మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ క్రీడా ఈవెంట్‌కు ఆతిథ్యం ఇవ్వబోతోంది. హాకి లో దేశానికి ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చిన ధ్యాన్ చంద్ స్ఫూర్తితో తెలంగాణ ప్రభుత్వ క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఫెడరేషన్ ఇంటర్నేషనల్ హాకీ వరల్డ్ క్వాలి÷ వుమెన్ హాకీ టోర్నమెంట్ 2026 నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసాము.మార్చి 8 నుంచి 14 వరకు జరిగే ఈ పోటీలు గచ్చిబౌలిలోని గచ్చిబౌలి హాకీ స్టేడియంలో జరగనున్నాయి. ఈ టోర్నమెంట్‌లో భారత్‌తో పాటు ఆస్ట్రియా, ఇంగ్లాండ్, ఇటలీ, కొరియా, స్కాట్లాండ్, ఉరుగ్వే,వేల్స్ జట్లు పాల్గొంటున్నాయి. ఈ జట్లు ఇప్పటికే హైదరాబాద్ చేరుకుని, గచ్చిబౌలి లో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన ఆస్ట్రో టర్ఫ్ మైదానంలో ప్రాక్టీస్ చేస్తున్నాయి. మహిళల వరల్డ్ కప్ హాకీ క్వాలి÷యైర్స్ 2026 కి ఈ పోటీలు కీలకంగామారనున్నాయి. టోర్నమెంట్‌ను లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అన్ని సదుపాయాలను సమకూర్చింది. క్రీడాకారుడు అయిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో గచ్చిబౌలి నందు అంతర్జాతీయ ప్రమాణాలతో ఆస్ట్రోట్రర్ఫ్ మైదానం, హై సెక్యూరిటీ, ఆధునిక సదుపాయాలు, క్రీడాకారులకు అత్యుత్తమ వసతి ఏర్పాట్లు చేయబడ్డాయి.ఇప్పటికే ఈ టోర్నమెంట్లో పాల్గొనబోతున్న అన్ని జట్లు హైదరాబాద్‌కు చేరుకున్నాయి. తెలంగాణ ప్రభుత్వ క్రీడా శాఖ ఘనంగా స్వాగత సత్కారాలు చేసింది. దానితోపాటు ప్రాక్టీస్‌కు కావలసిన అన్ని వసతులు, అంతర్జాతీయ ప్రమాణాల వసతి సదుపాయాలు అందుబాటులో ఉంచడం జరిగింది. అన్ని జట్ల క్రీడాకారిణిలు ఆధునికరించిన గచ్చిబౌలి ఆస్ట్రోట్రర్ఫ్ స్టేడియంలో బ్రహ్మాండంగా ప్రాక్టీస్ చేస్తున్నారు.

# దేశంలో తగ్గుతున్న ఫర్టిలిటీ రేటు

అమరావతి,మార్చి5 మన నేషనలిస్ట్ వాయిస్

జపాన్, దక్షిణ కొరియా, ఇటలీ లాంటి దేశాల్లో ఫెర్టిలిటీ రేట్ తగ్గుతోందని.. భారత్‌తో పాటు ఏపీ లాంటి రాష్టాల్లోనూ ఈ తరహా పరిస్థితే నెలకొందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో టోటల్ ఫెర్టిలిటీ రేట్ 1.5గా ఉందని.. 1993లో ఇది 3.0గా నమోదైందని సీఎం వివరించారు. టీఎఫ్ఆర్ వేగంగా తగ్గితే పని చేసే వయస్సులో ఉన్నవారి సంఖ్య గణనీయంగా తగ్గి, ఆర్థిక వృద్ధి మందగిస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే ఆర్థిక వ్యవస్థకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని చెప్పారు. ఏపీ శాసనసభలో పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. ఏపీకి అత్యంత కీలకమైన పాలసీని శాసనసభలో ప్రకటించారు. ఇప్పటి వరకు ఫ్యామిలీ ప్లానింగ్‌కు ప్రాధాన్యం ఇచ్చామని.. ఇకపై పాపులేషన్ కేర్ వైపు దృష్టి సారించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం డ్రాఫ్ట్ పాలసీని శాసనసభలో ప్రవేశపెట్టి ప్రజల ముందు ఉంచుతున్నామని వివరించారు. దీనిపై నెలరోజుల పాటు విస్తృత చర్చ జరగాలని కోరుతున్నామని సీఎం తెలిపారు. 2023 లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఏటా 6.70 లక్షల జననాలు

మొదటిపేజీ తరువాయి

నమోదవుతున్నాయని తెలిపారు. ఇలాగే కొనసాగితే 2047 నాటికి జనాభాలో 23 శాతం మంది వృద్ధులు ఉంటారని అన్నారు. మహిళల లేబర్ ఫోర్సు పార్టిసిపేషన్ రేట్ ప్రస్తుతం 31 శాతంగానే ఉంటుందని.. ఇది 59 శాతానికి చేరితే రాష్ట్ర జీఎస్‌డీపీ 15 శాతం పెరుగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. పాపులేషన్ మేనేజ్‌మెంట్ కోసం ఐదు అంచెల లైఫ్ సైకిల్ విధానాన్ని అమలు చేయాల్సి ఉందన్నారు. మాతృత్వం, శక్తి, క్షేమం, నైపుణ్యం, సంజీవని లాంటివి ఐదు పిల్లర్లుగా పనిచేస్తాయన్నారు. మహిళల గర్భధారణ నుంచి వృద్దాప్యం వరకు ప్రతి దశలో ప్రభుత్వం సహకారం అందిస్తోందన్నారు. పిల్లలు లేక ఫెర్టిలిటీ సమస్యలతో బాధపడేవారిని ప్రభుత్వం ఆదుకుంటుందని.. మాతృత్వ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసి, సబ్సిడీపై పీపీపీ మోడల్‌లో ఐవీఎఫ్(ఎ÷ఎఈ) సేవలు అందించాలని యోచిస్తున్నామని అన్నారు. సిజేరియన్ ఆపరేషన్లను తగ్గించడం ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. ప్రస్తుతం 8.8 శాతంగా ఉన్న టీనేజి గర్భధారణలను 3 శాతం కంటే తక్కువకు తగ్గించే చర్యలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. 10 మంది చిన్నారులు ఉన్న చోట చైల్డ్ కేర్ సెంటర్లు, పింక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నట్లు సీఎం తెలిపారు. మహిళల రక్షణ కోసం షీ క్యాబ్స్ అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నామన్నారు. విశాఖపట్నంలో రూ.172 కోట్లతో వర్కింగ్ ఉమెన్ హాస్టల్ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. మహిళా ఉద్యోగులు ఎక్కువగా పనిచేసే ప్రాంతాల్లో కొత్త వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. మూడో సంతానం, ఆపై జననాలకు తల్లులకు 12 నెలల పేరెంటల్ లీవ్, తండ్రులకు 2 నెలల పెటర్నల్ లీవ్ ఇవ్వాలని ఆలోచిస్తున్నామని అన్నారు. త్వరలో 'తల్లిదండ్రుల సమాన బాధ్యత' పేరుతో కుటుంబ బాధ్యతలు పంచుకోవడంపై అవగాహన క్యాంపెయిన్ నిర్వహిస్తామని సీఎం తెలిపారు. 2047 నాటికి ఏపీలో వృద్ధుల జనాభా 23 శాతం ఉంటుందని అంచనా వేస్తూ, ప్రతి జిల్లాలో వృద్ధుల సంరక్షణకు ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు సీఎం. 175 సీహెచ్‌సీలలో రెండు వారాలకు ఒకసారి ప్రత్యేక క్లినిక్ నిర్వహిస్తామని తెలిపారు. సిల్వర్ స్కిల్స్ రిజిస్ట్రీ ద్వారా 50,000 రిటైర్డ్ ప్రొఫెషనల్స్‌ను మెంటరింగ్‌లో భాగం చేస్తామన్నారు. రిటైర్మెంట్‌కు ముందే ఉద్యోగులకు 15 రోజుల వెల్‌నెస్ లీవ్, రూ.50,000 ఆరోగ్య నిధి అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి

# మూసీ పేరుతో కాంగ్రెస్ దోపిడీ

హైదరాబాద్,మార్చి5 మన నేషనలిస్ట్ వాయిస్

మూసీ పేరుతో దోచుకోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వం కుటిల ప్రయత్నాలు చేస్తున్నదని సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ పాలనలో వికాసం, కాంగ్రెస్ పాలనలో విధ్వంసం కొనసాగుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క ఇటుకను పేర్చనోడికి కూల్చే హక్కులేదని మండిపడ్డారు. నాగోల్ మూసీ పరీవాహక ప్రాంతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సుందరీకరణ పనులను గురువారం బీఆర్ఎస్ నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నాడు మూసీలోని మురుగు నీరుని శుద్ధి చేయాలని బీఆర్ఎస్ ముందుకెళ్లింది. దేశంలోనే అతిపెద్దది అయిన నాగోల్ ఎస్టీపీని రూ. 4వేలకోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాం. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇండ్లు కూల్చకండా, భూములు కోల్పోకుండా మూసీని అభివృద్ధి చేశామన్నారు. 2023 డిసెంబర్ వరకు 85 శాతం ఎస్టీపీ నిర్మాణం పూర్తయింది. 15 బ్రిడ్జీలు కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసింది. మిగతా పెండింగ్ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బంగారుపల్లెంలో పెట్టి కేసీఆర్ తెలంగాణను అప్పగించారు. కాంగ్రెస్ స్వార్థం కోసం రూ. 16 వేల కోట్ల అయ్యే ప్రాజెక్ట్ వ్యయం పది రెట్లు పెంచి 1.50లక్షల కోట్ల భారీ స్కాంకు తెరతీశారని ఆరోపించారు. హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అరాచకం సృష్టిస్తున్నది. రేవంత్ రెడ్డి అన్న తిరుపతి రెడ్డి ఇల్లు ఎఫ్‌టీఎల్ జోన్‌లో ఉంది అది కూలగొట్టే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. ప్రజలను రోడ్డున పడేసి ఏం సాధిస్తారన్నారు. సీఎం రేవంత్, మంత్రులు ఇలా అందరి ఇళ్లు బఫర్ జోన్‌లో ఉన్నాయి. మహబూబ్‌నగర్‌లో దివ్యాంగులు ఇళ్లు కూల్చారు. ఖమ్మంలో పేదల గుడిసెలను బుల్డోజర్లతో నేలమట్టం చేశారు. ఇవన్నీ రాహుల్ గాంధీకి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలను బయపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. రేవంత్‌కు రూ.16 వేల కోట్లతో మూసీని సుందరీకరించడం చేతకాకపోతే మేము చేసి చూపిస్తామని సవాల్ విసిరారు. రాష్ట్రంలో హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు హద్దే లేదని కేటీఆర్ విమర్శించారు. పేదల ఇళ్లు కూల్చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.1.50 లక్షల కోట్లతో మూసీ సుందరీకరణ పనులు చేస్తామని సీఎం రేవంత్ చెబుతున్నారు. రూ.16వేల కోట్లతోనే ఆ పనులను చేయొచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు గెలిపించింది హామీల అమలు కోసమేనని గుర్తు చేశారు. రెండున్నరేళ్లలో ఒక్క ఇల్లు నిర్మించినట్లు చూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకొంటా. మూసీ సుందరీకరణ పనుల బాధ్యత మాకు అప్పగిస్తే రూ.16వేల కోట్లకే చేసి చూపిస్తాం. ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా అభివృద్ధి చేస్తాం అని కేటీఆర్ అన్నారు. కెటిఆర్ వెంట మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి తదితరులు ఉన్నారు.

మొదటిపేజీ తరువాయి

# రాజ్యసభ అభ్యర్థులుగా సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి

హైదరాబాద్,మార్చి5 మన నేషనలిస్ట్ వాయిస్

తెలంగాణ నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున రాజ్యసభ అభ్యర్థులుగా అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల అధికారి ఉపేందర్‌రెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌తో పాలు పలువురు మంత్రులు హాజరయ్యారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పెద్ద ఎత్తున అసెంబ్లీ ప్రాంగణానికి చేరుకున్నారు. తెలంగాణ తరఫున రాజ్యసభకు రెండోసారి వెళ్లడం అదృష్టంగా భావిస్తున్నట్లు అభిషేక్ సింఘ్వీ తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేతలు సోనియా, రాహుల్, కేసీ వేణుగోపాల్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. రాజ్యసభ అభ్యర్థిగా అవకాశం కల్పించిన అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వేం నరేందర్‌రెడ్డి చెప్పారు. పస్తుతం సిటింగ్ ఎంపీగా ఉన్న అభిషేక్ మను సింఘ్వీ పేరును కాంగ్రెస్ ఎంపిక చేయగా ఆయన బుధవారం సాయంత్రమే హైదరాబాద్ వచ్చారు. రెండో స్థానానికి అభ్యర్థి ఎవరనే దానిపై రాత్రి వరకు చర్చలు, సంప్రదింపుల తర్వాత వేం నరేందర్‌రెడ్డి పేరును ఖరారు చేశారు. ఈయనకు రాజ్యసభ అభ్యర్థిత్వం ఖరారు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గట్టిగా కోరడం, అందరితో సన్నిహిత సంబంధాలుండే నరేందర్‌రెడ్డి పేరుపై ఎవరి నుంచీ అభ్యంతరాలు వ్యక్తం కాకపోవడంతో అధిష్ఠానం కూడా చివరకు సీఎం మాటకే ప్రాధాన్యం ఇచ్చింది. ఒకవేళ బీఆర్ఎస్ తన అభ్యర్థిని రంగంలోకి దింపితే రెండో స్థానానికి పోటీ అనివార్యమవుతుంది. ఆ పార్టీ పోటీలో లేకుంటే రెండు స్థానాలను కాంగ్రెస్ ఏకగ్రీవంగా దక్కించుకుంటుంది.

మొదటిపేజీ తరువాయి

# 2027 కల్లా నాంపల్లి స్టేషన్ ఆధునీకరణ

## - మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,మార్చి5 మన నేషనలిస్ట్ వాయిస్

:హైదరాబాద్ నాంపల్లి రైల్వే స్టేషన్‌ను 2027 చివరికల్లా అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఎయిర్‌పోర్ట్ తరహాలో ఆధునిక హంగుల్ని కల్పిస్తామని వెల్లడించారు. నాంపల్లి రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులపై అధికారులతో ఆయన సమీక్షించారు. తొలి దశలో రూ.327 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, దశల వారీగా స్టేషన్ రూపు రేఖలే మారుస్తామని స్పష్టం చేశారు. నాంపల్లి రైల్వేస్టేషన్ నుంచి మెట్రో స్టేషన్‌కు స్కై వాక్ ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఇప్పటికే సికింద్రాబాద్ ఆధునీకరణ పనులు జోరుగా సాగుతున్నాయని అన్నారు. అలాగే చర్లపల్లిని అత్యాధునకంగా తయారు చేశామని అన్నారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పనులు సాగుతున్నాయని అన్నారు.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

22 క్యారెట్ల బంగారం ధర కూడా భారీగానే తగ్గింది. 10 గ్రాములకు రూ.900 తగ్గి.. 1,49,900 పలుకుతోంది. ఇక బుధవారం 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 1,64,510 రూపాయలు..10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 1,50,800 రూపాయలు..10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర 1,23,380 రూపాయలు పలికింది. ఇరాన్-అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం ప్రభావంతో అంతర్జాతీయ గోల్డ్ మార్కెట్‌లో అనిశ్చితి నెలకొంది. ఫలితంగా దేశీయ మార్కెట్‌లో ధరలు భారీగా పతనం అయ్యాయి. హైదరాబాద్ నగరంలో 24, 22,18 క్యారెట్ల బంగారం ధరలు భారీగా తగ్గాయి. 24 క్యారెట్ బంగారంపై 980 రూపాయలు.. 22 క్యారెట్ బంగారంపై 720 రూపాయలు.. 18 క్యారెట్ల బంగారంపై 780 రూపాయలు తగ్గింది. ప్రస్తుతం 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం 1,63, 530 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం 1,49, 900 దగ్గర ట్రేడ్ అవుతోంది..10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం 1,22,650 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. రానున్న రోజుల్లో బంగారం ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# రాజ్యసభకు నితీశ్ నామినేషన్

బీహార్‌కు అత్యధిక కాలం సీఎంగా బాధ్యతలు నిర్వర్తించిన వ్యక్తిగా నితీశ్ రికార్డు క్రియేట్ చేశారు. అయితే రాజ్యసభలో సభ్యుడు కావాలన్న కాంక్ష ఉన్నట్లు ఆయన తెలిపారు. నితిశ్ తన అభిప్రాయాన్ని ఎక్స్‌లో వ్యక్తం చేశారు. బీహార్ రాజకీయాల్లో పెను మార్పులు జరగనున్నట్లు ఆయన చెప్పారు. నితీశ్ తప్పుకోవడంతో.. బీహార్‌కు బీజేపీ అభ్యర్థి సీఎం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇక నితీశ్ కుమారుడు నిషాంత్.. డిప్యూటీ సీఎం బాధ్యతలు చేపట్టే ఛాన్సు ఉన్నది. రెండు దశాబ్దాల పాటు తనపై నమ్మకాన్ని, విశ్వాసాన్ని ఉంచారని, దీని ఆధారంగానే బీహార్‌కు సేవ చేశానని, మీ నమ్మకం, మద్దతుతోనే బీహార్‌ను కొత్త అభివృద్ధి కోణం వైపు తీసుకెళ్లినట్లు చెప్పారు. తనపై నమ్మకాన్ని ఉంచి సపోర్టు ఇచ్చినందుకు గతంలో అనేక సార్లు కృతజ్ఞలు చెప్పినట్లు నితీశ్ పేర్కొన్నారు. తన రాజకీయ ప్రస్థానం మొదలైన నాటి నుంచి.. బీహార్ అసెంబ్లీ, మండలితో పాటు.. పార్లమెంట్ ఉభయసభల్లోనూ సభ్యుడిని కావాలన్న కాంక్ష ఉండేదని చెప్పారు. ఆ కోరికతోనే రాజ్యసభ సభ్యుడిని అయ్యే సందర్భం వచ్చిందన్నారు. భవిష్యత్తులో మీతో ఇదే రకమైన రిలేషన్ కొనసాగుతుందన్నారు. కొత్తగా ఏర్పడబోయే ప్రభుత్వానికి పూర్తి మద్దతు ఉంటుందన్నారు. బీహార్ సీఎం పోస్టు రేసులో నిత్యానంద్ రాయ్‌తో సమ్రాట్ చౌదరీ ముందు వరుసలో ఉన్నట్లు తెలుస్తోంది.

మొదటిపేజీ తరువాయి

## త్వరలోనే రాజకీయ పార్టీ ఏర్పాటు

అదే సమయంలో తెలంగాణ రాజకీయాల్లో కీలక ప్రకటన చేశారు. మరో రెండు నెలల్లో తెలంగాణలో కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఈ పార్టీని స్థాపించనున్నట్లు చెప్పారు. కుల, మత, వర్గ భేదాలు లేకుండా ప్రజలకు సేవ చేసే పార్టీగా దీనిని తీర్చిదిద్దుతామని కవిత తెలిపారు. తెలంగాణ ఫస్ట్ అనే నినాదంతో ప్రజల సమస్యలను మైక్రో లెవెల్‌లో పరిష్కరించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్ష పాత్రను బీఆర్ఎస్ సరిగా నిర్వహించలేకపోయాయని ఆమె విమర్శించారు. మరోవైపు.. ఆంధ్రప్రదేశ్ ప్రజలపై తమకు ఎలాంటి ద్వేషం లేదని, రాజకీయ ఆధిపత్యాన్ని మాత్రమే వ్యతిరేకించామని కవిత స్పష్టం చేశారు. అలాగే హైడ్రా చర్యలపై కూడా ఆమె విమర్శలు గుప్పించారు. హైడ్రా పేదలను ఇబ్బంది పెట్టి పెద్దల కోసం పనిచేస్తోందని ఆరోపించారు. తాను ఎప్పుడూ పేదల పక్షాన నిలబడి పోరాడతానని కవిత అన్నారు. అలాగే తనకు న్యాయం చేసిన న్యాయవ్యవస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

# సంపాదకీయం

## ప్రజలను ముంచే ... మూసీ అభివృద్ధి తగదు !

అభివృద్ధి పేరిట అరాచకాలు, దాని వెనక సంపాదన లక్ష్యాలు..తప్ప ప్రజల పక్షాన ఆలోచించే ప్రభుత్వాలు కానరావడం లేదు. ప్రజలకు ఏం చేస్తే బాగుపడతారన్న ఆలోచనలు చేయడం లేదు., తాయిలాలతో ఓట్లు దండుకుని పాలన చేసే రోజులు పోవాలి. స్వాతంత్ర్యం లభించి 79 ఏళ్లు పూర్తి కావస్తున్న వేళ .. ఇంకా పేదరికం తాండవించ డానికి పాలకుల దూదరదృష్టి, చిత్తశుద్ధి లోపమే ప్రధాన కారణం. ప్రజల నుంచి పన్నుల రూపంలో వస్తున్న డబ్బును సమర్థంగా నిర్వహించడం లేదు. నేటికీ కిలో రూపాయి బియ్యం అందించడం ప్రజలను అవమాన పర్చడమే. పేదరికం పేరుతో నాలుగు రాళ్లు విదిలించి తమ పబ్బం గడుపుకోవడం, దాని వెనక ఉన్న అధికారదాహం గుర్తించాలి. పథకం ఏదైనా ప్రజలను మభ్య పెట్టడం ఒకటయితే..అధికారం అంటిపెట్టు కోవడం దాని లక్ష్యంగా మారింది. అన్నింటికి మించి తెలంగాణ రావాలని, కావాలని కొట్లాడిన ప్రజలంతా దగాపడ్డారు. మోసపోయారు. కానీ తెలంగాణ పేరుతో తీపికబుర్లు చెప్పిన వారంతా అందలం ఎక్కారు. కెసిఆర్ కుటుంబం ఇందులో ముందున్నది. లక్షల కోట్ల అప్పు మన నెత్తిన పెట్టి, అధికారం పోయినా తామే అభివృద్ధి చేశామని నంగనాచి కబుర్లు చెబుతోంది. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ వంటి ప్రాజెక్టుల పేరుతో ఊర్లు ఖాళీ చేయించారు. భూములు గుంజుకున్నారు. వారిని రోడ్డు పడేశారు. ఊళ్లకు ఊళ్లు మాయమయ్యాయి. ఆ ప్రాజెక్టుల్లో మా ఊరు ఉందని చూసుకుని మురిసేలా ..వారి జీవితాలను మాత్రం బాగు చేయాలేదు. ఏనాడు కూడా ఆ ప్రజల గురించి కెసిఆర్ ఆలోచించలేదు. ఫార్మాసిటీ పేరుతో కూడా అలాగే భూములను లాగేసుకున్నారు. ఇక కెసిఆర్‌ను తిట్టి, ఆయన తెలంగాణను అడ్డంగా దోచుకున్నాడని చెప్పి, ప్రజల మద్దతు పొంది అధికారం చేపట్టిన రేవంత్ రెడ్డి చేస్తున్నదేమిటి? ఆయన కూడా అదే దారిలో పాలన సాగిస్తున్నాడు. అన్నీ మంచే చేస్తున్నానని చెప్పే ప్రచార క్రమంలో ప్రజలను విస్మరిస్తున్నారు. ప్రజలను విస్మరించి, వారిని గోసపెట్టి చేపట్టే పనులతో ఏం బావరుకుందామని అనుకుంటున్నారో చెప్పాలి. హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడంలో కానీ, మూసీ నుంచి మురికిని తరిమి వేయడంలో కానీ ప్రజలకు అభ్యంతరం ఉండదు. ఎక్కడో సర్దార్ సరోవర్ ప్రాజెక్టులో అత్యంత ఎత్తయిన పటేల్ విగ్రహాన్ని కట్టారని, హైదరాబాద్‌లో అంతకు మించి గాంధీ విగ్రహం కట్టడం లక్ష్యంగా చేస్తున్న ప్రయత్నంలో ఆంతర్యం బోధపడనిది కాదు. మూసీ అభివృద్ధి వరకు బాగానే ఉంది. కానీ భారీ విగ్రహాలతో సాధించేదేముంది. గాంధీకి భారీ విగ్రహం లేకుంటే ఆ మహాత్ముడికి వచ్చే నష్టం ఏమీ లేదు. కానీ ఈ విగ్రహం పేరుతో, మూసీ ప్రక్షాళన పేరుతో వేలాదిమంది ప్రజలను నిరాశ్రయులను చేయాలన్న కుటిల యత్నాలను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిందే. మూసీ పరివాహక ప్రాంతంలో తరలించా లనుకుంటున్న ప్రజలకు ముందుగా ఎక్కడ ఇళ్లు నిర్మిస్తారో చెప్పండి. ఉన్న భూములను వేలం వేస్తూ పోతున్న రేవంత్ ప్రభుత్వం ఈ పేదలకు ఎక్కడ భూములు ఇస్తుందో ముందు చెప్పాలి. హైదరాబాద్ నగర అభివృద్ధిలో భాగంగా పేరుతో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో చేపడుతున్న మూసీ నది అభివృద్ధి ప్రణాళిక కారణంగా ఎన్నివేల కుటుంటంబాలు రోడ్డున పడతాయో చెప్పాలి. ఖమ్మం జిల్లాలో రాత్రికి రాత్రి భూదాన్ భూముల పేరుతో ప్రజలను రోడ్డున పడేశారు. ఉన్న జాగాల్లోనే వారిని ఎందుకు ఉండనీయడం లేదు. కొత్తగా ఇందిరమ్మ ఇళ్లను కట్టిస్తామని చెప్పడం దగా చేయడం తప్ప మరోటి కాదు. ఉన్న భూములను అమ్ముకోవడం, ఉన్నావారిని ఖాళీ చేయించడం ద్వారా తెలంగాణ ప్రజలను రాచి రంపాన పెడుతున్న ఈ ప్రభుత్వ చర్యలను ప్రజలు నిలదీయాల్సిందే. నగరంలో మూసీ ప్రక్షాళన పేరుతో గాంధీ సరోవర్ ప్రాజెక్టు ప్రత్యేక ఆకర్షణగా ప్రచారం చేస్తున్నారు. మూసీ నదిని శుద్ధి చేసి, రివర్ ఫ్రంట్‌గా తీర్చిదిద్ది, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వం సంకల్పం మంచిదే అయితే ప్రజలు కూడా స్వాగతిస్తారు. కానీ అభివృద్ధి పేరుతో వారి గూడును చెదరగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. నిజంగానే వారిని ఈ ప్రాజెక్టులో భాగస్వామ్యం చేస్తే ప్రణాళిక గొప్పగా ముందుకు సాగుతుంది. మూసీ అభివృద్ధి మంచి సంకల్పమే అయితే ఖాళీ చేయించే వారికి భూమికి భూమి, ఇల్లుకు ఇల్లు, ఫ్లాట్‌కు ఫ్లాట్ ఎక్కడ ఇస్తారో ముందుగా ప్రకటించాలి. అక్కడ కాలనీలు అన్ని వసతులతో నిర్మించాలి. మీరు ఇవ్వాలను కుంటున్న పిచ్చుక గూడు ఇందిరమ్మ ఇళ్లతో ప్రజలను మభ్య పెట్టరాదు. మూసీ నదిని శుద్ధి చేయాల్సిందే. ఈకంపును దూరం చేయాల్సిందే. పర్యావరణ పునరుద్ధరణ జరగల్సిందే. వరద నియంత్రణ చేయల్సిందే. పర్యాటకాభివృద్ధి కూడా రావాల్సిందే. ఇవన్నీ నగర ప్రజలు కోరుకుంటున్నవే. మీరు చేస్తానంటే వద్దని అనడం లేదు. కానీ ప్రజలను ఏమార్చి వారిని తరిమి కొట్టి ఇదంతా చేయడం ద్వారా వచ్చే ప్రయోజనాలను పొందాలన్న యత్నం మాత్రం సరికాదు. గత కొన్ని దశాబ్దాలుగా మూసీ కాలుష్యానికి గురైందన్నది కళ్లకు కనిపిస్తున్న నిజం. ప్రభుత్వం ప్రకటిస్తున్న మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి కేవలం కార్పోరేట్ ప్రయోజనాలకే అన్న అపోహ ఉంది. అయితే మూసీ వెంట ఉన్న ప్రజల నివాస హక్కులు, జీవనోపాధి, భద్రత గాలికి వదిలేసి ముందుకు సాగాలన్న నిరంకుశ విధానమే సరికాదు. దీనినే ప్రతి ఒక్కరు ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధి పేరుతో ప్రజల గూడును, ఇంటితో వారికున్న అనుబంధాన్ని నిరంకుశంగా తొలగిస్తామంటే కుదరదు. హైదరాబాద్ నగరంలో మొత్తం 55 కిలోమీటర్ల పరిధిలో మూసీని శుభ్రపరిచి పునరుద్ధరించాలన్న సంకల్పాన్ని అక్కడ నివసిస్తున్న ప్రజలు కూడా స్వాగతించేలా కార్యాచరణ ఉండాలి. వారిని కూడా ఈ అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలి. ఇక్కడ నివసిస్తున్న వారిని తరలిస్తే..మూసీ కంపు నుంచి బయట పడ్డామన్న భావన ప్రజల్లో రావాలి. అంతకన్నా మంచి ప్రాంతంలో వారికి ఇల్లు కట్టించి ఇవ్వాలి. ఆకర్షణీయమైన మూసీ ప్రాజెక్టులో ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా కాపాడే ప్రణాళిక ఉండాలి. పునరావాసం అన్నది మూసీ ప్రక్షాళనకు మించిన ప్రాజెక్టులా ఉండాలి. ఇక్కడినుంచి తరలించిన వారు నివసించే ప్రాంతం మరో ప్రత్యేక పర్యాటక ప్రాంతంగా మారాలి. ఒక నివాసాన్ని కూల్చడం సులభం. కానీ ఒక సమాజాన్ని మళ్లీ నిర్మించడం కష్టసాధ్యం. పునరావాసం అంటే కేవలం కొత్త ఇల్లు కట్టివ్వడం కాదు. అదే పరిసరాల్లో ఉపాధి అవకాశాలు, విద్య, వైద్యం, రవాణా సౌకర్యాలు కల్పించడం కూడా అంతే అవసరం. లేకపోతే ప్రజలు మానసికంగా కృంగి కృశించి పోతారు. గతంలో జరిగిన అనుభవాల దృష్ట్యా మూసీ పరివాహకంలో ప్రజలను తరలించే ప్రక్రియ పారదర్శకంగా సాగాలి. వారికి ఉత్తేజాన్ని కలిగించేలా ఉండాలి. ఈ ప్రాజెక్టులో భాగమైనందుకు వారంతా ఆనందించేలా ఉండాలి. అంతేకానీ రోడ్డున పడేసే కార్యక్రమం కారాదు. అప్పుడు కెసిఆర్ పాలనకు, రేవంత్ పాలనకు తేడాలేదన్న భావన కలుగుతుంది. ఆ ఒక్కటి చాలు చితి పెట్టడానికి అని గుర్తించాలి.

# తెలుగు రాష్ట్రాల్లో టెన్త్ పరీక్షలకు రెడీ

**తెలంగాణలో 14 నుంచి, ఎపిలో 16 నుంచి పరీక్షలు**

**వాట్సాప్ ద్వారా హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్‌కు అవకాశం**

హైదరాబాద్,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):

తెలుగు రాష్ట్రాల్లో పదో తరగతి పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు విడుదల య్యాయి. తెలంగాణలో మార్చి14 నుంచి.. ఏపీలో16 నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఈ పరీక్షలకు ఇంకా కొన్ని రోజులు మాత్రమే గడువు ఉంది. దీంతో ఆయా రాష్ట్రాల ఎస్‌ఎస్‌సీ బోర్డులు పరీక్షల హాల్‌టికెట్లను గురువారం విడుదల చేశాయి. వివిధ విభాగాలకు చెందిన విద్యార్థుల హాల్ టికెట్లను వెబ్‌సై ట్‌లలో వేర్వేరుగా అందుబాటులో అధికా రులు ఉంచారు. తెలంగాణలో విద్యార్థులు తమ హాల్‌టికెట్లను బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ అధికారిక వెబ్‌సైట్ , ఏపీ విద్యార్థులు వాట్సాప్‌లో హాల్ టికెట్లు పొందవచ్చు. ఇక ఏపీ విద్యార్థులు మన మిత్ర (వాట్సాప్ నంబర్ 9552300 009) లేదా లీప్ యాప్ ద్వారా.. అలాగే తెలంగాణ విద్యార్థులు వాట్సప్ నంబర్ (8096958096) ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అలా కుదరకుంటే.. సంబ ంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల వద్ద నుంచి కూడా ఈ పరీక్ష హాల్ టికెట్లను విద్యార్థులు పొందవచ్చు. తెలం గాణ అభ్యర్థులు 8096958096 వాట్సప్ నంబర్‌కు హాయ్ అని సందేశం చేయగానే మీ ఫోన్‌కి వెల్‌కమ్‌టూ మీ సేవ అని వస్తుంది. చాట్‌లో టైప్ చేసి మెసేజ్ చేయండి. మీ మొబైల్‌కు ఒక లింక్ వస్తుంది. ఆ లింక్‌ను ఓపెన్ చేసి జిల్లా, పాఠశాల పేరును ఎంచుకోండి. విద్యార్థి పేరు, పుట్టిన తేదీ నమోదు చేస్తే హాల్‌టికెట్ మీ ఫోన్‌లోనే వస్తుంది. ఈ హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసి భద్రపరు చుకోండి. ఏపీలో వాట్సప్‌లో డౌన్‌లోడ్ ఇలా.. మీ ఫోన్‌లో 55230 0009 నంబర్‌కు హాయ్ అని మెసేజ్ పంపాలి. సర్వీస్ సెలక్షన్ అనే ఆప్షన్ వస్తుంది. ఎడ్యుకేషన్ సర్వీసెస్‌ను ఎంచుకోండి. అక్కడ ఎస్‌ఎస్సీ హాల్‌టికెట్ అనే ఆప్షన్‌ను సెలక్ట్ చేసుకోవాలి. అప్లికేషన్ నంబర్/ చైల్డ్ ఐడీతోపాటు పుట్టిన తేదీ వివరాలను ఎంటర్ చేయాలి. రెగ్యులర్/ప్రైవేట్/ ఓఎస్‌ఎస్‌సీ రెగ్యులర్/ఒకేషనల్‌లలో మీకు సంబంధించిన కేటగిరీని ఎంచుకొని కన్‌ఫర్మ్ చేయాలి. ఆ తర్వాత కొన్ని నిమిషాలకు హాల్‌టికెట్ మీ వాట్సప్ నంబర్‌కే వస్తుంది. ఈ హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసి భద్రపరుచుకోవాలని సూచించారు.

# ముగిసిన రాజ్యసభ నామినేషన్లు

**కాంగ్రెస్ నుంచి ఇద్దరు, ఒక ఇండిపెండెంట్ పోటీ**

**పదిమంది ఎమ్మెల్యేల సంతకాలు చేయించని ఇండిపెండెంట్**

హైదరాబాద్,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):

రాజ్యసభ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ గురువారం ముగిసింది. నామినేషన్లు ముగ్గురు వేసినా, ఇండిపెండెంట్‌గా వేసిన సాయి అనే వ్యక్తి నామినేషన్ తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంది. పదిమంది ఎమ్మెల్యేల సంతకాలు చేయాల్సి ఉన్నా, అతను కేవలం నామినేషన్ వేశారు. దీంతో స్క్రూటినీలో చెల్లుబాటు కాదు. ఈ కారణంగా ఇద్దరి ఎన్నిక ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉంది. కాంగ్రెస్ పార్టీ తరపున తెలంగాణ నుంచి రాజ్యసభ సభ్యులుగా అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. అసెంబ్లీ కార్యాలయంలో ఎన్నికల అధికారి ఉపేందర్ రెడ్డికి వీరు నామినేషన్ పత్రాలు సమర్పించారు. సింఘ్వీ.. మూడు సెట్‌ల నామినేషన్లు దాఖలు చేయగా.. వేం నరేందర్ రెడ్డి నాలుగు సెట్‌లు, ఇండిపెండెంట్ అభ్యర్థి సాయి.. ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. దీనికి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేల తోపాటు ఎమ్మెల్యేలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. 10 మంది ఎమ్మెల్యేల సంతకాలు లేకుండా ఇండిపెండెంట్ అభ్యర్థి సాయి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఈ నామినేషన్లను ఎన్నికల అధికారి పరిశీలించనున్నారు. ఎమ్మెల్యేల సంతకాలు లేని ఇండిపెండెంట్ అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరించనున్నారు. దాంతో అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ అభ్యర్థులు నిలవనున్నారు. వీరి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బరిలో నిలపలేదు. గతంలో తెలంగాణ నుంచి రాజ్యసభకు వెళ్లిన అభిషేక్ మను సింఘ్వీ పదవి కాలం మరికొద్ది రోజుల్లో ముగియనుంది. ఆయనకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం మరోసారి రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించింది. ఇక తెలంగాణ నుంచి మరో రాజ్యసభ స్థానానికి తీవ్ర పోటీ నెలకొంది. కాంగ్రెస్ పార్టీలోని సీనియర్లు, సూపర్ సీనియర్లు దాదాపు 16 మంది పోటీ పడ్డారు. ఆ జాబితాలోని ఎవరికి ఈ రాజ్యసభ స్థానం దక్కుతుందంటూ తీవ్ర ఉత్కంఠ సైతం నెలకొంది. అందుకోసం బుధవారం ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి.. పార్టీ అగ్రనేతలతో వరుస భేటీలు అయ్యారు. చివరకు తన సన్నిహితుడు వేం నరేందర్ రెడ్డి పేరు ఖరారు చేయిం చుకున్నారు.

# కుదుట పడ్డ స్టాక్ మార్కెట్లు

**నష్టాల నుంచి స్వల్పంగా లాబాల్లోకి**

ముంబై,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):

పశ్చిమాసియాలోని ఉద్రిక్తతల కార ణంగా గత మూడు సెషన్లలో భారీ నష్టాలను చవిచూసిన దేశీయ సూచీలు గురువారం కోలుకున్నాయి. అణు ఒప్పం దం విషయంలో ఇరాన్ కాస్త వెనక్కి తగ్గి నట్టు ఆ దేశ విదేశాంగ మంత్రి మాట్లా డడం సూచీలపై పాజిటివ్ ప్రభావాన్ని చూపింది. అలాగే కనిష్ఠాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపడం, అంత ర్జాతీయంగా కొన్ని సానుకూల సంకేతాలు సూచీలను లాభాల వైపు నడిపించాయి. అలాగే డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి కాస్తంత కోలుకుంది. అలాగే ఆయిల్, గ్యాస్ రంగ స్టాక్స్‌లో కొనుగోళ్లు కూడా కలిసొచ్చాయి. చివరకు సెన్సెక్స్, నిఫ్టీ లాభాలతో రోజును ముగించాయి .గత సెషన్ ముగింపు (79,116)తో పోల్చు కుంటే గురువారం ఉదయం 400 పాయింట్లకు పైగా లాభంతో మొదలైన సెన్సెక్స్ రోజంతా లాభాల్లోనే కదలాడింది. మధ్యాహ్నం తర్వాత ఆ లాభాలు మరింత పెరిగాయి. ఒక దశలో దాదాపు 1200 పాయింట్లు లాభపడి 80,303 వద్ద ఇంట్రాడే గరిష్ఠానికి చేరుకుంది. చివరకు సెన్సెక్స్ 811 పాయింట్ల లాభంతో 79,927 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 285 పాయింట్ల నష్టంతో 24,765 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్, నిఫ్టీలో మాజగాన్ డాక్, నాల్కో, బ్లూ స్టార్, బీఎస్ లిమిటెడ్, పెట్రోనాట్ ఎల్ఎన్‌జీ మొదలైన షేర్లు లాభాలు ఆర్జించాయి. ఆయిల్ ఇండియా, కేపీఐటీ టెక్, ఎంఫసిస్, కోఫోర్జ్, పెర్సిస్టెంట్ మొదలైన షేర్లు నష్టాల బాటలో సాగాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 867 పాయింట్లు లాభపడింది. బ్యాంక్ నిఫ్టీ 300 పాయిం ట్లు ఆర్జించింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 91.60గా ఉంది.

# ఉమ్మడి గోదావరిలో ఎస్సీ కమిషన్ చైర్మన్ పర్యటన

**నేడు రాజమండ్రికి చేరుకోనున్న కిశోర్ మక్వానా**

రాజమహేంద్రవరం,మార్చి5

( మన నేషనలిస్ట్ వాయిస్ ):

జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా మార్చి 6వ తేదీ నుంచి మార్చి 8వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యటించనున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు రానున్నారని కలెక్టర్ కీర్తి చేకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రం రాజమ హేంద్రవరం విమానాశ్రయానికి చేరుకుని, ఓఎన్‌జీసీ అతిథి గృహంలో రాత్రి బస చేస్తారు. శనివారం ఉదయం 11:00 గంటలకు తూర్పు గోదావరి జిల్లాలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమ కార్యక్రమాలు, ఆర్థిక అభివృద్ధి మరియు రక్షణాత్మక చర్యలపై కలెక్టర్, పోలీసు సూపరిం టెండెంట్ మరియు ఇతర ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం ధవళేశ్వరం వర్క్‌షాప్‌లో, ఓఎన్‌జీసీ ప్రాంగణంలో డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం మరియు ఓ ఎన్ జి సి అధికారుల సమావేశంలో పాల్గొంటారు. తదుపరి వివిధ అధికారిక సమావేశాలు నిర్వహించి, దిండి (రాజోలు) ప్రాంతంలోని సామాజిక సంక్షేమ వసతి గృహాలను సందర్శించి అక్కడే రాత్రి విశ్రాంతి తీసుకుంటారు. ఆదివారం ఉదయం 11:00 గంటలకు డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. అనం తరం ఎక్కడ నుంచి బయలుదేరి విజయవాడ చేరుకుని, విమానాశ్రయం నుండి ఎయిర్ ఇండియా విమానం ద్వారా న్యూ ఢిల్లీకి వెళతారు. జిల్లా స్థాయి అధికారులతో మార్చి 7వ శనివారం ఉదయం జరిగే సమీక్షా సమావేశం స్థానిక కలెక్టరేట్ పి.జి.ఆర్.ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించ బడుతుందని, అధికారులు ఉదయం 10.30 గంటలకి సంబంధిత నివేదికలతో సమావేశం కు హాజరు కావాలని, జిల్లాలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, అమలులో ఉన్న పథకాలు, సమస్యల పరిష్కారం మరియు రక్షణాత్మక చర్యల అమలుపై సమగ్రంగా సమీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎస్.కె. జియాఉద్దీన్ తెలిపారు.

# నంద్యాల జిల్లాలో స్కూళ్లల్లో శక్తి టీమ్ ప్రచారం

**బాల్య వివాహాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై వివరణ**

నంద్యాల,మార్చి5

( మన నేషనలిస్ట్ వాయిస్ ):

నంద్యాల జిల్లా వ్యాప్తంగా గురువారం అన్నీ స్కూళ్లలో, కాలేజీల్లో మహిళలపై నేరాలు , బాల్య వివాహాల నిరోధం, గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్, ఈవ్ టీజింగ్ పై నియంత్రణ, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఆదేశాల మేరకు నంద్యాల సబ్ డివిజన్ ఏ ఎస్ పి ఎం.జావళి సూచనలతో నంద్యాల సబ్ డివిజన్ శక్తి టీం సిబ్బంది జిల్లా పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ దగ్గర గల చిన్మయ మిషన్ విద్యాలయ హై స్కూల్ నందు విద్యార్థినిలకు శక్తి యాప్ గురించి, వాటి వలన కలిగే ప్రయోజనాల గురించి సవివరంగా వివరించారు. మీ తల్లిదండ్రులకు శక్తి యాప్ గురించి తెలియజేసి వారి సెల్ ఫోన్ లలో రిజిస్టేషన్ చేసుకునేలా చూడాలన్నారు. అనంతరం ప్రస్తుతం సమాజంలో జరిగే సైబర్ క్రైమ్ నేరాల గురించి వివరించి ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి తక్షణ సహాయం పొందవచ్చునని అవగా హన కల్పించారు. బాల్య వివాహాలు, మహిళలు,చిన్నపిల్లలపై జరిగే నేరాల గురించి అవగాహన కల్పించి వాటికి సంబందించిన టోల్ ఫ్రీ నెంబర్ 1098 గురించి వివరించారు. ఆపద సమయంలో అమ్మాయిలు శక్తి యాప్ నంబర్ 7993485111 కు ఫోన్ చేసినచో తక్షణమే స్పందిస్తామని శక్తి టీం బృందాలు తెలిపారు. నంద్యాల జిల్లాలో గల వన్ స్టాప్ సెంటర్ యొక్క ప్రాముఖ్యతను తెలిపి శక్తి టీముల పనితీరును వివరించడంతో పాటు అత్యవసర సమయంలో ఉపయోగిం చవలసిన 112/100 గురించి తెలిపారు. మీరు బాధ్యతగల పౌరులుగా ఎదగాలని, విద్యతో పాటు మంచి నైతిక విలువలను అలవర్చుకోవాలన్నారు. బాలికలు అన్ని రంగాల్లో రాణించగల సామర్థ్యం కల వారని, ధైర్యంగా ముందుకు సాగాల న్నారు. ఏవైనా అనుమానాస్పద సంఘ టనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధ్యాపకులకు తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశంలో

## - ఎమ్మెల్యే డా. సంజయ్




### ముఖ్య అతిథిగా హాజరై ఆడబిడ్డకు చీర పెట్టి ఎమ్మెల్యే శుభాకాంక్షలు..

జగిత్యాల జిల్లా ప్రతినిధి, మార్చి 05 ( మన నేషనలిస్ట్ వాయిస్ ):

జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామానికి చెందిన కొత్తపల్లి లింగం ప్రణీత దంపతులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి చేసుకొని నేడు గృహప్రవేశం సందర్భంగా దంపతుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా హాజరైన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కొత్తపల్లి లింగం ప్రణీత కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కానుకగా చీరను అంద జేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీద మధ్యతరగతి ప్రజలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలలో లబ్ది చేకూరాలని ఫేస్ రికాగ్నిజ్ ద్వారా సంక్షేమ పథకాలు అమలుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. అనర్హులను తొలగించి అర్హులకు అందించడమే ముఖ్య లక్ష్యం అన్నారు. గత ప్రభుత్వం గృహ లక్ష్మీ, గత కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో బేస్ మెంట్ వరకు పూర్తి అయిన వారికి 4 లక్షలు ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులు అన్నారు. డబల్ బెడ్ రూం ఇండ్ల డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ప్రజల సహకారం కూడా ఉండాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి చైర్మన్ కొలుగురి దామోదర్ రావు, సర్పంచ్ శీలం సురేందర్, ఉప సర్పంచ్ బాలే శ్రీనివాస్, ఎంపీఓ వాసవీ, కార్యదర్శి అజయ్, మాజీ సర్పంచ్లు ప్రభాకర్ మల్లేశం, సర్పంచ్లు గోడిసెల గంగాధర్, సంగేపు మహేష్, మాజీ ఉప సర్పంచ్ మహేష్, వార్డు సభ్యులు,అర్బన్ మండల, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల కళ్ళల్లో సంతోషం.. కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం..




### అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తాం

### మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి (గజ్వేల్), మార్చి 05 ( మన నేషనలిస్ట్ వాయిస్ ):

పేదవాల్ల కళ్ళల్లో సంతోషం చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని, అర్హులైన పేదలు అందరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరీ చేస్తామని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గురు వారం మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ లో ఇందిరమ్మ ఇంటిని గృహప్రవేశం చేయించిన సందర్భంగా ఆయన ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నేతలు ఊడెం సారిక శ్రీనివాస్ రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ షరీఫ్‌తో కలిసి మాట్లాడారు. గజ్వేల్ నియోజకవర్గానికి 35 వందల ఇండ్లను మంజూరు చేయగా అందులో 80 శాతం లబ్ధిదారుల ఇంటి నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం సైతం లబ్ధిదారుల ఆర్థిక ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని వెంట వెంటనే బిల్లులు చెల్లిస్తున్నట్లు చెప్పారు. సొంత స్థలం ఉన్న నిరుపేదలు నేరుగా తమను సంప్రదిస్తే ఇందిరమ్మ ఇల్లు మంజూరి చేస్తామని పేర్కొన్నారు. అంతేగాకుండా ప్రతి పేదకి రేషన్ కార్డు మంజూరి చేయడంతో పాటు సన్న బియ్యం అందజేస్తున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా రైతుల సంక్షేమం కోసం రూ. 2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ, విద్యా ర్థులకు ఫీజు రీయింబర్స్మెంట్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ అవస రాలకు 200ల యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను కాంగ్రెస్ సర్కార్ అమలు చేస్తోందని అన్నారు. గజ్వేల్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని సాధ్యమైనంత మేర నిధులు సాధిస్తూ వివిధ పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, నేతలు నాయిని యాదగిరి, గుంటుకు శ్రీనివాస్, నక్క రాములు గౌడ్, సమీర్, గాడిపల్లి శ్రీనివాస్, రామరాజు, గుండు లక్ష్మణ్, నేతి నాగ రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పనులు త్వరగా పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్..

జగిత్యాల జిల్లా ప్రతినిధి, మార్చి 05 ( మన నేషనలిస్ట్ వాయిస్ ):

జగిత్యాల జిల్లా మెట్ పెల్లి మండలం వెల్లుల్ల గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని ఆయన సమీక్షించి, లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణానికి ఉపయోగిస్తున్న ఇటుకలు, ఇసుక, సిమెంట్ వంటి సామగ్రి ధరలు, వాటి నాణ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనులు నిర్వహించాలని సూచించారు. నిర్మాణ పనులు ఆలస్యం కాకుండా వేగవంతంగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేస్తే ప్రభుత్వ నిధులు కూడా త్వరగా విడుదల అవుతాయని, అందువల్ల లబ్ధిదారులు ఆలస్యం చేయకుండా పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అధికారులు కూడా పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన సహకారం అందించాలని ఆయన ఆదేశించారు. ఈ పరిశీలనలో హౌసింగ్ అధికారి పీడీ ప్రసాద్, మెట్పల్లి ఎంపీడీవో, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# ఉప్పల్ ప్రెస్ క్లబ్ కు సహకారం అందిస్తా

## -మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి..

హైదరాబాద్, మార్చి 05 ( మన నేషనలిస్ట్ వాయిస్ ):

ఉప్పల్ ప్రెస్ క్లబ్ కు తనవంతు సహకారం అందజేస్తామని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తెలంగాణ యూనియన్ అఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టియూడబ్ల్యూజే) మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి గడ్డమీది బాలరాజు, దొంతుల వెంకట్రాంరెడ్డి, ఉప్పల్ నియోజకవర్గం అధ్యక్షులు పల్లా మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిని గురువారం నూతనంగా ఎన్నికైన ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రతినిధులు కలిశారు. ఈ మేరకు రెండవసారి చైర్మన్ గా ఎన్నికైన సందర్భంగా మీడియా అకాడమీ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్చం అందజేసి, శాలువాతో సత్కరించారు. అనంతరం క్లబ్ అధ్యక్షులు వి. తిరుపతి రెడ్డి, కార్యదర్శి జి.శివాజీలు కలిసి సీఎం రేవంత్ రెడ్డి, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డితో కూడిన మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం తనవంతు సహకారం అందజేస్తామన్నారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్ చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అభినందించారు. జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి గ్యారంపల్లి శివాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ పారెల్లి సాగర్, ఉపాధ్యక్షులు శ్రీధర్ రావు, నరోత్తం రెడ్డి, కోశాధికారి గుత్తి శేఖర్, జాయింట్ సెక్రటరీ దాస రాజు, ఓ. రమేష్ పాల్గొన్నారు.




# ఉపాధి హామీ పై కేంద్రం విధించిన ఆంక్షలు సడలించాలి




### -జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్..

జగిత్యాల జిల్లా ప్రతినిధి, మార్చి 05 ( మన నేషనలిస్ట్ వాయిస్ ):

జగిత్యాల అర్బన్ మండల పరిషత్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులు కార్యక్రమంలో భాగంగా సర్పంచులకు అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధులు అధికారులు సమిష్టిగా పని చేసి విజయ వంతం చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ అన్నారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉప సర్పంచ్లు వారి బాధ్యతలు నిర్వర్తించాలంటే గ్రామ ప్రజల సహకారం ముఖ్యమైనదని, గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత, త్రాగునీరు, వీధి దీపాలు తదితర ముఖ్య వసతులు సక్రమంగా అందించే విధంగా ప్రజాప్రతినిధులు ప్రాధాన్యం ఇవ్వాలి. వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా త్రాగునీటి వృధాను అరికట్టాలి. గ్రామాల్లో డంపింగ్ యార్డ్ నిర్వహణ పటిష్టంగా అమలుచేయాలని, గ్రామంలో చెత్త సేకరణలో తడి, పొడి చెత్త వేరుగా చేసి ప్రజల నుండి తీసుకోవాలి, తద్వారా గ్రామంలో కంపోస్టు ఎరువు తయారు అవుతుంది. గ్రామానికి లాభం చేకూరుతుంది. గ్రామంలో ప్లాస్టిక్ వేరుచేసి ఇవ్వడం ద్వారా రీసైక్లింగ్ చేసే అవకాశం ఉంటుందని, చెత్తతో పాటే ఇవ్వడం వల్ల కరగదు అని అన్నారు. గ్రామాల్లో వేసవి సమయంలో పల్లె ప్రకృతి వనాలు మొక్కలు చెట్ల పరిరక్షణకు ప్రాముఖ్యత ఇస్తూ నీటితడులు అందించాలి. ప్రతి వారం గ్రామాల్లో డ్రై డే నిర్వహించి నిలువ నీటిని శుభ్రం చేయడం ద్వారా రోగాలు రాకు ండా, దోమలు పెరగకుండా చూడవచ్చు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్ర మంలో భాగంగా ప్రజాప్రతినిధులు అధికా రులు ప్రభుత్వం రూపొందించిన అంశా లకు అనుగుణంగా పనిచేస్తూ ప్రభుత్వ అధికారుల ద్వారా సమన్వయం చేసుకొని గ్రామ అభివృద్ధికి ఉపయోగించుకోవాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జీఎస్టీ రూపంలో పన్నులు చెల్లిస్తుందని, తెలంగాణ రాష్ట్రానికి 40 శాతం ఇస్తుందని హక్కుగా రావాల్సిన వాటా మాత్రమే మనకు వస్తుందని అన్నా రు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పేరు మార్చి కఠిన నిబంధనలు అమలు చేయడం వల్ల రాష్ట్రాలకు ఇబ్బందిగా మారిందని అట్టి నిబంధనలను సడలిం చాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ కోరారు. ఈ కార్యక్ర మంలో ఎంపీఓ వాసవి, సూపరిండెంట్ శ్రీనివాస్, పిఆర్ ఏఈ విజయ్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వినయ్, హౌసింగ్ ఏఈ భార్గవ్, సర్పంచులు మహేష్, గంగాధర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యసభ అభ్యర్థులు సింఘ్వీ, నరేందర్ రెడ్డిలకు కవ్వంపల్లి అభినందనలు

**ఉమ్మడి కరీంనగర్ బ్యూరో, మార్చి 05 ( మన నేషనలిస్ట్ వాయిస్ ):**

తెలంగాణ నుంచి రాజ్యసభకు కాంగ్రెస్ అభ్యర్థులుగా ఖరారైన సిటింగ్ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డిని టీపీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షులు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వం సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. గురువారం వారు హైదరాబాదులో నామినేషన్లు దాఖలు చేయగా ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పలువురు ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



# ఆయిల్ ఫాం సాగు అత్యంత లాభదాయకం

## సాగు కోసం రైతులు ముందుకు రావాలి

## సిద్దిపేట జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, మార్చి 05 ( మన నేషనలిస్ట్ వాయిస్ ):**

ఆయిల్ ఫామ్ సాగు అత్యంత లాభదాయకమని, సిద్దిపేట జిల్లాలో సాగు చేయడానికి పెద్దఎత్తున రైతులు ముందుకు రావాలని, వ్యవసాయ క్షేత్రాలలో వేసిన పంటలే వెయ్యకుండా పంట మార్పిడి చెయ్యాలని జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి రైతులకు విజ్ఞప్తి చేశారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలంలోని దుంపలపల్లి గ్రామంలో గురువారం ఆయిల్ ఫామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్ లో భాగంగా రైతు చింత రాజు వ్యవసాయ క్షేత్రంలో 12 ఎకరాల విస్తీర్ణంలో జిల్లా కలెక్టర్ ఆయిల్ ఫామ్ మొక్కను నాటారు. జిల్లాలో ఇప్పటి వరకు 14,200 ఎకరాలు ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ జిల్లాలో రైతులందరూ వరి సాగు మీదనే ఎక్కువ దృష్టి పెడతారని, దీనివల్ల నాలుగు నెలల్లో వచ్చే ఆదాయం అనుకున్న దాని కంటే చాలా తక్కువ అని, రైతులకు ఉండే వ్యవసాయ క్షేత్రంలో కొంత వరి వేసుకొని మిగతా భాగంలో పంట మార్పిడితో కూరగాయలు పండించడం, వివిధ రకాల తోటల పెంపకం, పండ్ల తోటలు, ఆయిల్ ఫాం సాగు చెయ్యాలని తెలిపారు. ప్రభుత్వం ఆయిల్ ఫామ్ సాగును ఎక్కువగా ప్రచారం చేస్తుందని రైతుకు ఎకరాకు రూ.50 వేలు ఆయిల్ ఫామ్ మొక్కలను, డ్రిప్పు, మెయింటెనెన్స్ కాస్ట్, ఫామ్పొండ్స్ ఇలా రకరకాలుగా రూ.50వేలు ప్రభుత్వం అందజేస్తుందనీ రైతులు క్రమంగా మూడు సంవత్సరాలు ఆయిల్ ఫామ్ సాగును చేస్తే నాలుగో సంవత్సరం నుండి ఆదాయం వస్తుందని తెలిపారు. ఈ మూడు సంవత్సరాల్లో కూడా మొక్క వేళ్లకు ఎలాంటి



ఇబ్బందులు కలగకుండా అంతర పంటలు వేసుకునే ఆస్కారం కూడా ఉందని, మూడు సంవత్సరాల తర్వాత కూడా అరటి, కోకో వంటి అంతర పంటలు ద్వారా కూడా అదనపు ఆదాయం పొంద వచ్చని, ఆయిల్ ఫామ్ వల్ల నెలకు ప్రభుత్వ ఉద్యోగస్తులతో సమానమైన వేతనం రైతులు పొందవచ్చని తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్న రైతులు వారి పంట సాగు లాభాల విషయాలను పలువురు రైతులకు తెలిపి ప్రోత్సహించాలని, జిల్లా రైతులు పంట మార్పిడి చెయ్యాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ వెంట జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి సువర్ణ, తహసీల్దార్ సంజీవ్,

# మోడీ ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలి

## కార్పొరేట్ల కోసం కాదు కార్మిక, కర్షకుల కోసం ప్రభుత్వం పని చేయాలి

## సిపిఎం సదాశివపేట ఏరియా కార్యదర్శి వి ప్రవీణ్ కుమార్

**సదాశివపేట, మార్చి 05, ( మన నేషనలిస్ట్ వాయిస్ ):**

కార్మిక, కర్షకుల హక్కులను కాలరాస్తూ అంబానీ, ఆదాని లాంటి కార్పోరేట్ శక్తుల కొమ్ము కాయడం కేంద్ర ప్రభుత్వం వెంటనే మానుకోవాలని, ప్రజా సమస్యల్ని పరిష్కరించాలని సిపిఎం సదాశివపేట ఏరియా కార్యదర్శి వి ప్రవీణ్ కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సదాశివపేట మండలంలోని నంది కంది గొల్లగూడెం గ్రామాలలో గురువారం ఆయన ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తూ కొత్తగా విబిజిరామ్జి చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని, పాత చట్టంలో కూలీలకు ఉన్నటువంటి హక్కులన్నీ కాలరాస్తూ కొత్త చట్టాన్ని రూపొందించారని, పాత చట్టం ప్రకారమే ఉపాధి హామీ పనులను కొనసాగించాలని అన్నారు. ఉపాధి హామీ సక్రమంగా నడవాలంటే మూడున్నర లక్షల కోట్లు బడ్జెట్ పెట్టాలని కేంద్ర ప్రభుత్వం 95 వేల కోట్లు మాత్రమే కేటాయింపులు చేశారని దీంట్లో పాత బకాయిలకే 10శాతం పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ కిట్లు టెంట్లు మంచినీళ్లు పని ప్రదేశంలో పెట్టకుండా కూలీలకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం 90శాతం నిధుల్ని కేటాయించకుండా 60శాతం నిధులే ఇస్తామనడం సిగ్గుచేటని అన్నారు. కార్మికుల హక్కులను తొలగించి కార్మికులకు అనుకూలంగా ఉన్న చట్టాలను మార్చి పెట్టుబడుదారులకు అనుకూలంగా చట్టాలు తయారు చేస్తుంది అన్నారు. రాష్ట్రాల పరిధిలో ఉన్న విద్యుత్తు ఉత్పత్తి, పంపిణీని కేంద్ర ప్రభుత్వం చేతుల్లోకి తీసుకొని రైతులకు, పేదలకు ఉచిత విద్యుత్తు ఇవ్వకుండా సబ్సిడీలు ఎత్తివేయాలని విద్యుత్ సవరణ చట్టం తేవడం సమంజసం కాదని అన్నారు. తెలంగాణలో విత్తనాలు ఉత్పత్తి చేసి వివిధ దేశాలకు ఎగుమతి చేస్తున్నారని, విత్తన చట్టాన్ని తీసుకొచ్చి తెలంగాణ రైతులపై భారాలు మోపడం మానుకోవాలని. కార్మిక, కర్షకుల హక్కులపై కుట్ర చేస్తే అందరిని సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సదాశివపేట ఏరియా కమిటీ సభ్యులు రమేష్ గౌడ్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



# 99 రోజుల యాక్షన్ ప్లాన్ ను జిల్లాలో విజయవంతం చేయాలి







## సిద్దిపేట జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి

## జిల్లా అధికారులతో జూమ్ సమీక్ష సమావేశం

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, మార్చి 05 ( మన నేషనలిస్ట్ వాయిస్ ):**

రాష్ట్రవ్యాప్తంగా మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ 99 రోజుల యాక్షన్ ప్లాన్ ను సిద్దిపేట జిల్లాలో నిర్వహించి విజయవంతం చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమ నిర్వహణపై ఏంపిడిఓలు, పంచాయతీరాజ్ ఏఈలు, ఏపిఎంలకు జిల్లా కలెక్టర్ హైమావతి జూమ్ సమావేశం ద్వారా దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహించాలని, జిల్లాలో వివిధ శాఖలకు నిర్దేశించిన పనులను వారికి కేటాయించిన వారాలలో 99 రోజుల యాక్షన్ ప్లాన్ ప్రకారం కార్యక్రమంను పగడ్బందీగా అమలు చేయాలని సూచించారు. జిల్లాలో ప్రభుత్వ అంద జేస్తున్న పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు విద్యా, వైద్యం, వనమ హోత్సవం, తాగునీటి సరఫరా, సన్నబి య్యం, రైతు భరోసా, మహాలక్ష్మి, గృహ లక్ష్మీ, రూ.500 గ్యాస్ సబ్సిడీ, సన్న వడ్లకు రూ.500 బోనస్, ఇందిరమ్మ ఇళ్లు, హాస్టల్లలో డైట్ ఛార్జీలు పెంపుదల, పారిశుధ్యం ఇతరత్ర కార్యక్రమాలపై ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రజలకు తెలియ జేయాలని తెలిపారు. ప్రతి గ్రామపం చాయతీలో పలు పథకాల ద్వారా లబ్ది పొందిన వివరాలను ఫ్లెక్సీలు వెయ్యాలని తెలిపారు. ఇందిరమ్మ గృహ ప్రవేశాలు రూఫ్ స్థాయిలో ఉన్నవి పూర్తి చేయించాలని ఆయా స్థాయిలో ఉన్న నిర్మాణాలను యుద్ధ ప్రతిపాదకన పూర్తి చేయించాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ఈ సంవత్సరంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులను ఎంపికలో పూరి గుడిసెల్లో ఇబ్బందికరమైన పరిస్థితిలో నివసిస్తున్న వారికి మొదటి ప్రాధాన్యత కల్పిస్తూ ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులుగా వారిని ఎంపిక చేయాలని తెలిపారు. ఈ నెల మొత్తం ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పనులు పూర్తి చేసుకుంటూ ఈ కార్యక్రమాలు చెయ్యాల్సి ఉంటుందని, ఉపాధి హామీలో కూలీల శాతం పెంచేందుకు కృషి చెయ్యాలని ఏంపిడిఓలను ఆదేశించారు. మాస్టర్ జెనరేట్ లో సమస్యలు ఎదురైన, ఎల్లప్పుడు వారికి టచ్ లో ఉంటూ రోజు వారిగా మానిటర్ చెయ్యాలని డిఆర్డిఓ జయదేవ్

# వార్డులో వీధి దీపాల సమస్య పరిష్కారం

## 14వ వార్డు కౌన్సిలర్ గుంటుకు లక్ష్మీ శ్రీనివాస్

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి (గజ్వేల్), మార్చి 05 ( మన నేషనలిస్ట్ వాయిస్ ):**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు భారత్ నగర్ కాలనీలో నెలకొన్న వీధి దీపాల సమస్యను పరిష్కరించినట్లు వార్డు కౌన్సిలర్ గుంటుకు లక్ష్మీ శ్రీనివాస్ గురువారం తెలిపారు. కాలనీలోని కొన్ని విద్యుత్ స్తంభాలకు వీధి దీపాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిన వెంటనే వారు స్పందించారు. మున్సిపల్ సిబ్బందితో మాట్లాడి, వీధి దీపాలు లేని ప్రతి స్తంభానికి కొత్త లైట్లను అమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డు ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రథమ ప్రాధాన్యత అని, మౌలిక సదుపాయాల కల్పనలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు.





# విద్యార్థులకు రుచికరమైన సరిపడ భోజనం అందించాలి

## సిద్దిపేట జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, మార్చి 05 ( మన నేషనలిస్ట్ వాయిస్ ):**





విద్యార్థులకు రుచికరమైన సరిపడా భోజనం అందించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి ఆదేశించారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం ధర్మారం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ప్రక్రియను జిల్లా కలెక్టర్ హైమావతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్నం, ఆలుగడ్డ టమాటా, టమాటా చారులను పరిశీలించారు. రోజు కామన్ డైట్ మెనూ పాటిస్తూ రుచికరంగా ప్రతి వంట విద్యార్థులకు సరిపోయే విధంగా వండాలని వంట సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థుల హాజరు ప్రకారం వంట ప్రక్రియను ఆహారం రుచికరంగా వండి విద్యార్థులకు పెట్టించాలని ప్రిన్సిపల్ ను ఆదేశించారు. పాఠశాల మొత్తం కలియ తిరుగుతూ 4 వ తరగతికి వెళ్ళి విద్యార్థులతో ఆప్యాయంగా పలకరించారు. విద్యార్థులతో పద్యాలను కథలను చదివించి విద్యార్థిని అభినందించారు. పాఠశాల మీ సబ్జెక్ట్స్ పాటు గ్రంథాలయంలో పలు పుస్తకాలలోని కథలు చదవాలని, కథలలోని సారాంశాన్ని మీ టీచర్ ను అడిగి తెలుసుకోవాలని సూచించారు. పద్యాలు గట్టిగా బిగ్గరగా పలు మార్లు చదివితే కంఠస్థం అవుతుందని తెలిపారు. మధ్యాహ్నం భోజనం బాగా తినాలని చదువుతో పాటు ఆటలు ఆడుకోవాలని తెలిపారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలోని అంగన్వాడి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి పిల్లలకు మంచి పోషక విలువలు కలిగిన ఆహారం పెట్టాలని ఆకుకూరలు, మునగాకు, గుడ్లు పెట్టాలని టీచర్ ను ఆదేశించారు.

# బీసీ వెల్ఫేర్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్







## విద్యా బోధన, సదుపాయాలను పరిశీలించిన కలెక్టర్ సత్య ప్రసాద్..

## విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అధికారులదే..

జగిత్యాల జిల్లా ప్రతినిధి, మార్చి 05 ( మన నేషనలిస్ట్ వాయిస్ ):

మెట్‌పల్లి పట్టణంలోని బీసీ వెల్ఫేర్ పాఠశాలను గురువారం జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన, వసతి సౌకర్యాలు, భోజన ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ గదులు, వంటగది, భోజనశాలను పరిశీలించిన కలెక్టర్ పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అధికారులదని పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్య అందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, హాజరు శాతం పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పాఠశాలలో ఎలాంటి లోపాలు ఉండకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో ఎస్సీ వెల్ఫేర్ రాజ కుమార్, విద్యాశాఖ జిల్లా కోఆర్డినేటర్ సత్యనారాయణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# జాతీయ ఆహార భద్రత చట్టం 2013ను పకడ్బందీగా అమలు చేయాలి





## సిద్దిపేట జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి

## కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశం

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, మార్చి 05 ( మన నేషనలిస్ట్ వాయిస్ ):

జాతీయ ఆహార భద్రత చట్టం 2013 ను జిల్లాలో పగడ్బందీగా అమలు చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ హైమావతి అధ్యక్షతన డిస్టిక్ లెవెల్ విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హాజరయ్యారు. ఈ సమావేశంలో జాతీయ ఆహార భద్రత చట్టం 2013 అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ పేద వారికి ఆహార భద్రత కల్పించడంలో భాగంగా జిల్లాలో గల 26 మండలాలలో గల మొత్తం 686 చౌక ధరల దుకాణాల పరిధిలో 3 లక్షల 33 వేల 332 ఆహార భద్రత కార్డుల ద్వారా 10 లక్షల 37వేల262 మంది లబ్ధిదారులకు ప్రతి నెల 6,583 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం సరఫరా చేయడం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాల లలో మధ్యాహ్న భోజనం, సంక్షేమ వసతి గృహాలు, గురుకుల విద్యాసంస్థలలో ఆహారం, అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ఆహార భద్రత కోసం కల్పించిన ఈ వసతులు లబ్ధిదారులకు అందేలా అధికారులు వంద శాతం పర్యవేక్షణ చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, గురు కులాలు, సంక్షేమ హాస్టల్లో పాటు అంగన్వాడీ కేంద్రాలను కూడా తనిఖీ చేస్తానని మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించకుంటే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అంగన్వాడీల అభివృద్ధి పనులను పరిశీలిస్తానన్నారు. మధ్యాహ్నం భోజనంకోసం ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేసే సన్న బియ్యం నాణ్యతగా ఉండాలని సూచించారు. హాస్టల్ల నుండి వర్కర్స్ వంట సరుకులు బైటకు తీసుకువెళ్లకుండా హాస్టల్స్ లో సిసి కెమెరాలు పెట్టాలని, మెనూ ప్రకారం క్వాలిటీ, క్వాంటిటీ ఆహారం అందించాలన్నారు. అన్ని హాస్టల్లో పిల్లలు ఇబ్బంది పడకుండా త్రాగునీరు, మరుగు దొడ్ల సౌకర్యం సమస్య రాకుండా చూడాలన్నారు. సంక్షేమ హాస్టల్లో ఆహార పదార్థాల నాణ్యతను పర్యవేక్షించేందుకు ప్రతీ మండలానికి ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తానని తెలిపారు. సిద్దిపేట, గజ్వేల్ లో ఎస్సీ వెల్ఫేర్ పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు వసతి ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో జరిగే క్రయ విక్రయాలలో తూనికలు, కొలతలలో మోసంతో ప్రజలు ఇబ్బంది పడకుండా తనిఖీలు చేయాలని తూనికలు కొలతల అధికారిని ఆదేశించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ అంగన్వాడీల ద్వారా పేద పిల్లలకు నాణ్యమైన ఆహారం అందేలా పర్యవేక్షించాలని అదేవిధంగా అంగన్ వాడి టీచర్, ఆయా పోస్టుల ఖాళీలను భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఆశయం మేరకు ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం అన్ని సంక్షేమ హాస్టల్లో పౌష్టికాహారం అందించాలన్నారు. జిల్లాలో అత్యధిక విద్యార్థులు నమోదైన ప్రభుత్వ పాఠశాలలో ఒకటైన పోతరెడ్డిపేట జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి తనూజ, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ గోపికృష్ణ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి జయదేవ్ ఆర్య, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్, జిల్లా తూనికలు కొలతల అధికారి శివరంజని, డీఈవో శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి శారద, జిల్లా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

జగిత్యాల జిల్లా ప్రతినిధి, మార్చి 05 ( మన నేషనలిస్ట్ వాయిస్ ):

మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయాన్ని గురువారం జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో జరుగుతున్న పన్నుల వసూళ్ల ప్రక్రియపై ఆయన సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ పరిధిలో ఆస్తి పన్ను, నీటి పన్ను, ఇతర పన్నుల వసూళ్ల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం సమయానికి అందేలా పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా వసూళ్లను పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ఎక్కువ కాలంగా బకాయిలు ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి సారించి వసూళ్లు చేయాలని ఆదేశించారు. మున్సిపల్ పరిధిలో పన్నుల వసూళ్లలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, ప్రజలకు అవగాహన కల్పిస్తూ పన్నులు చెల్లించేలా ప్రోత్సహించాలని తెలిపారు. మున్సిపల్ సేవలను మెరుగుపరచడంలో పన్నుల వసూళ్లు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ తనిఖీలో మున్సిపల్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం అందిస్తాము

## -జిల్లా అదనపు కలెక్టర్ బి. ఎస్. లత..

జగిత్యాల జిల్లా ప్రతినిధి, మార్చి 05 ( మన నేషనలిస్ట్ వాయిస్ ):

జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని రాజారం గ్రామ పంచాయతీ యందు గురువారం గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఈ గ్రామ సభకు జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత హాజరై ఎన్.హెచ్ 563 రోడ్డు విస్తరణ భూసేకరణలో భాగంగా భూములు కోల్పోతున్న వారి గురించి సందేహాలు అడిగి వారి సందేహాలు నివృత్తి చేసినారు. ఈ గ్రామసభలో గ్రామ సర్పంచ్ విజయ్, తహసిల్దార్ వసంత, ఆర్ఐ తిరుపతి, జిపిఓ ప్రవీణ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# కొండగట్టు దేవస్థానంలో భక్తులకు మజ్జిగ పంపిణీ ప్రారంభం

## -ఆలయ ఈఓ ఎల్. రమాదేవి..

చొప్పదండి ప్రతినిధి, మార్చి 05:( మన నేషనలిస్ట్ వాయిస్ ):

జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో ఇంఛార్జి ఈఓ ఎల్. రమాదేవి గురువారం వేసవి కాలంలో ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఈఓ మాట్లాడుతూ దేవస్థానం వేరుగు నుండి డోనర్ల సహకారంతో స్వామి వారిని దర్శించుకొనే భక్తులకు ఆలయంలో మజ్జిగ అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈవో రమాదేవి ప్రధాన ఆలయం పరిసరాలు, ఆలయ కార్యాలయం, పారిశుభ్రత, విఐపీ పార్కింగ్, టికెట్ కౌంటర్లు, ముఖ్య బుకింగ్ కేంద్రాలు తదితర ప్రదేశాలను పరిశీలించారు. ఆలయ ఉద్యోగులతో మాట్లాడి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ నిర్వహించిన పరిచారిక పోస్టుల పరీక్షల్లో ఉత్తీర్ణులైన ముగ్గురు అభ్యర్థులను కొండగట్టు ఆలయానికి పరిచారికులుగా టి హరికృష్ణ ప్రసాద్, వి .అరుణకుమార్, టి.గోపిలకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ హరిహరనాద్, పర్యవేక్షకులు చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, వేద పండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.




# గ్రేట్ మిలియన్ మార్చ్ డే ను విజయవంతం చేయాలి

## - తెలంగాణ ఉద్యమ కళాకారుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు వేముల యాదగిరి

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి (గజ్వేల్), మార్చి 05 ( మన నేషనలిస్ట్ వాయిస్ ):**

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో చారిత్రాత్మక ఘట్టంగా నిలిచిన మిలియన్ మార్చ్ ను స్మరించుకుంటూ ఈ నెల 10న గ్రేట్ మిలియన్ మార్చ్ డేను తెలంగాణ ఉద్యమాకరుల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని తెలంగాణ ఉద్యమ కళాకారుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు వేముల యాదగిరి అన్నారు. గురువారం గజ్వేల్ అంబేద్కర్ చౌరస్తాలో ఛలో గన్ పార్క్ గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన అమర వీరులను స్మరించుకోవడంతో పాటు ఉద్యమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు నివాళులు అర్పించనున్నారు. తెలంగాణ సాధనలో భాగంగా జరిగిన మిలియన్ మార్చ్ ఉద్యమం రాష్ట్ర చరిత్రలో కీలక మలుపు తిప్పిందని, ఆ ఉద్యమ స్ఫూర్తిని మరువకుండా తెలంగాణ అమరవీరులను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు, ఉద్యమకారులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మార్చి 10, 2026 న ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద గ్రేట్ మిలియన్ మార్చ్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని. టీయూజేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి నాయకత్వంలో తెలంగాణ ఉద్యమకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ టియుకెవి రాష్ట్ర కన్వీనర్ కోయడ రాజేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు మైలారం కిరణ్, చదువుల వీరేష్, బుడిగే నర్సన్న, గిరిపల్లి మల్లేష్, లింగారెడ్డిపల్లి నందు, హనుమంతు, తుర్కపల్లి జాంగీర్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు ప్రాథమిక చదువు, నైపుణ్యాలు తప్పనిసరిగా నేర్పించాలి





## -జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్..

### విద్యార్థి సరిగ్గా చదవకపోవడంపై ప్రధానో పాధ్యాయురాలిపై కలెక్టర్ ఆగ్రహం..

### పరిస్థితి మెరుగుపడకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక..

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, మార్చి 05 ( మన నేషనలిస్ట్ వాయిస్ ):**

మెట్ పెల్లిలోని ప్రభుత్వ పాఠశాలను గురువారం జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆకస్మికంగా సందర్శించి విద్యా ప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చదువుతున్న తీరును స్వయంగా పరీక్షించి 9వ తరగతి చదువుతున్న ఒక విద్యార్థి సరిగా చదవలే



కపోవడం గమనించి ప్రధానో పాధ్యాయురాలిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు కనీస ప్రాథమిక చదవు నైపుణ్యాలు కూడా రాకపోవడం ఆందోళన కరమని పేర్కొంటూ ప్రధానోపా ధ్యాయురాలిని ప్రశ్నించారు. పాఠశాలలో ప్రతి విద్యార్థికి సరైన విధంగా చదవడం నేర్పించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ 30 రోజుల లోగా ప్రతి విద్యార్థికి కనీసం చదవడం రావాలని లేకపోతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మరో సారి పాఠశాల సదర్శించేలోపు పరిస్థితి మెరుగుపడకపోతే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులు మరింత బాధ్యతతో పనిచేసి బోధనలో నాణ్యతను పెంచాలని, ప్రతి విద్యార్థి చదువులో ముందుకు రావడానికి ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ పరిశీలనలో ఎస్సీ వెల్ఫేర్ రాజ్ కుమార్, విద్యాశాఖ జిల్లా కోఆర్డినేటర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు సానిటరీ ప్యాడ్ కిట్స్ పంపిణీ

## కిట్స్ అందజేసిన మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎదుగాని లహరి

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, మార్చి 05 ( మన నేషనలిస్ట్ వాయిస్ ):**

సిద్దిపేట నియోజకవర్గం చిన్నకోడూరు, నంగునూర్, నారాయణరావుపేట మండలాల బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు ఎదుగాని లహరి ఆధ్వర్యంలో చిన్నకోడూరు మండలం ఎల్లమ్మ జాలు గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా చేపట్టిన మహిళ సానిటరీ కిట్స్ ను సూమారు వంద మంది మహిళలకు గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన జిల్లా కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు ముద్దం లక్ష్మితో కలిసి ఎదుగాని లహరి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి కోటి మంది మహిళలను కోటిశ్వరులను చేయడమే లక్షంగా పెట్టుకొవడమే కాకుండా వారి ఆరోగ్య పరిస్థితి మెరుగుగా ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రతి మహిళల నెలసరికి వాడే శానిటరి కిట్స్ విషయంలో కూడా కెమికల్స్ ప్యాడ్స్ వాడి అనారోగ్యం బారిన పడకుండా కెమికల్ లేని సానిటరీ కిట్స్ ను ఇలా ప్రభుత్వమే మహిళలకు అందజేయడం శుభపరిణామం అన్నారు. అంతేకాకుండా త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా మహిళల అందరికి ఈ సానిటరీ ప్యాడ్స్ అందజేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్బంగా వారు జిల్లా మహిళల తరుపున సీఎం రేవంత్ రెడ్డి, ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హన్మంతరావు, నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణకు కృతజ్ఞతలు తెలియజేసారు ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు రజిని, మమత, ఎల్లమ్మ జాలు వార్డ్ మెంబెర్ లాస్య, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# అంగన్‌వాడీల దశ మారుతోంది

## వాటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాం

## ముస్తాబు కార్యక్రమంతో పిల్లల్లో ఆసక్తి

## అసెంబ్లీలో వెల్లడించిన మంత్రి సంధ్యారాణి

**అమరావతి,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):**

ఇప్పుడు అంగన్‌వాడీలకు స్టేషన్ రికగ్నిజైషన్ ఉండటంతో అందరూ సెంటర్లకు వస్తున్నారని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. 'ముస్తాబు' కార్యక్రమంతో అంగన్‌వాడీల్లోని పిల్లలు కూడా చక్కగా చదువుకొంటున్నారని మంత్రి సంధ్యారాణి వివరించారు. అసెంబ్లీ 14వ రోజు గురువారం అంగన్‌వాడీల అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా పాక్షికంగా పూర్తయిన అంగన్‌వాడీ భవనాల అంశంపై పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు ప్రశ్నించారు. ఈ విషయంపై తెలుగుదేశం రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడారు. అంగన్‌వాడీల్లో ఆకస్మిక తనిఖీలు చేయాలని తాము వెళ్లినప్పుడు ఆయా కేంద్రాల్లో ఐదుగురు మాత్రమే ఉంటున్నారని చెప్పుకొచ్చారు. ఇది భారీ కార్యక్రమమని.. చాలా మందికి ఉపాధి కల్పించిందని తెలిపారు. కడియం మండలంలో స్థానిక సంస్థల నిధులతో అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు ఏర్పాటు చేశారని గోరంట్ల బుచ్చయ్య ప్రస్తావించారు. అలాగే ఇదే అంశంపై మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడారు. ఏపీ వ్యప్తంగా 55,746 అంగన్‌వాడీ కేంద్రాల్లో 21,756 సొంత భవనాలు, 10,556 కేంద్రాలు ప్రభుత్వ భవనాల్లో ఉన్నాయని వివరించారు. 23,424 కేంద్రాలు అద్దె భవనాల్లో ఉన్నాయని... వాటిని అమలు చేస్తు న్నామని, వాటిలో కొన్ని భవనాలు నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు. 2922 భవనాల నిర్మాణాలను అమలు చేశామని.. వీటిలో 948 అంగన్‌వాడీ భవనాలు పూర్తి దశలో ఉన్నాయని.. వాటికోసం రూ.4కోట్లు విడుదల అయ్యాయని చెప్పుకొచ్చారు. రూ.193 కోట్లు ఉంటే అన్ని అంగన్‌వాడీ భవనాలు పూర్తిచేయగలుగుతామని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు 62 సంవత్సరాలు పూర్తయితే వారికి గ్రాట్యూటీ ఇస్తామని స్పష్టం చేశారు. రాగి, జొన్నలను కూడా ఆహారంగా అందిస్తున్నామని తెలిపారు. 547 కేంద్రాలు రిపేర్లలో ఉన్నాయని, 9240 కేంద్రాల్లో టాయిలెట్స్, 11,400 కేంద్రాల్లో తాగునీటి వసతి కల్పించామని అన్నారు. అంగన్‌వాడీల్లోని పిల్లలు బరువు పెరుగుతున్నారో లేదో చూసుకొనే బాధ్యత కూడా టీచర్లకు, ఆయాలకు అప్పగిస్తున్నామని వెల్లడించారు. అంగన్‌వాడీల్లోని పిల్లల హాజరు.. గతంలో 70శాతం ఉంటే.. ఇప్పుడు 93శాతం ఉందన్నారు. దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో ఏపీ ఉందని చెప్పుకొచ్చారు. 20వేల కేంద్రాలకు ఇండక్షన్ స్టౌలు ఇచ్చామని తెలిపారు. ఇండోర్ గేమ్స్, చార్ట్‌లు, పిల్లలకు ఈ ఏడాది అందించామని వెల్లడించారు.అంగన్‌వాడీలకు గతంలో రూ.4200 జీతం ఉండేదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.11,500 జీతం పెంచామని మంత్రి సంధ్యారాణి తెలిపారు. తమ ప్రభుత్వం అంగన్‌వాడీలకు మూడు సార్లు జీతం పెంచిందని చెప్పుకొచ్చారు. అంగన్‌వాడీలు పది డిమాండ్లు అడిగితే వాటిలో 9 పూర్తి చేశామని తెలిపారు. రూ.75 కోట్లతో 5జీ ఫోన్లను అంగన్‌వాడీలకు ఇచ్చామని వివరించారు. జనాభా ప్రాతిపదికన కొత్త అంగన్‌వాడీలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అంగన్‌వాడీల అన్ని సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని మంత్రి సంధ్యారాణి మాటిచ్చారు.

# అసెంబ్లీలో అందరూ ఉంటేనే సమస్యలపై చర్చ

## ప్రజా సమస్యలకు చర్చలే పరిష్కారం

## అనర్హత వేటు అంశం ఏపి ఆదర్శం కావాలనుకుంటున్నా

## ఎపి స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్య

**అమరావతి,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ )**

:అసెంబ్లీలో అందరూ ఉంటేనే మసాలా ఉంటుందని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. చర్చలు జరిగితేనే ప్రజల సమస్యలపై పరిష్కారానికి అవకాశం వస్తుందన్నారు. విపక్షం దీనిని ఉపయోగించుకోలేక పోయిందని అన్నారు. గురువారం తన ఛాంబర్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో స్పీకర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల కోసమే ఎమ్మెల్యేలు ఎన్నికవుతారని... అలాంటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక అయిన అసెంబ్లీకి గైర్హాజరు సబబు కాదని అన్నారు. వైసీపీలో జగన్ మోహన్ రెడ్డి మినహా మిగిలిన ఎమ్మెల్యేలంతా జీతాలు తీసుకుంటున్నారని స్పీకర్ గుర్తు చేశారు. వైసీపీ సభ్యులకు నోటీసులు ఇవ్వాలంటే తగిన సమయం రావాలన్నారు.అనర్హత వేటు అంశం ఆంధ్రప్రదేశ్‌లో సక్సెస్ అయితే దేశ వ్యాప్తంగా సక్సెస్ అవుతుందని స్పీకర్ అన్నారు. గవర్నర్ ప్రసంగం రోజు అసెంబ్లీకి వచ్చినా అది హాజరుగా పరిగణించాలనే నిబంధన ఎక్కడ ఉందో 'నెంబర్ వన్ స్టూడెంట్' అని చెప్పుకునేవాళ్లు చూపించాలని సవాల్ విసిరారు. గవర్నర్ ప్రసంగం రోజు అసెంబ్లీకి వస్తే.. అది హాజరుగా పరిగణించబడదని స్పష్టం చేశారు. అడ్డగోలు వాదనలు చేసే వారిని ఏమనాలని స్పీకర్ ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రిగా జగన్ మోహన్ రెడ్డికి దక్కాల్సిన అన్ని గౌరవ మర్యాదలు లభిస్తున్నాయని అయ్యన్నపాత్రుడు చెప్పారు. జగన్ తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పార్టీలకు అతీతంగా అందరు ఎమ్మెల్యేలతో సరదాగా ఉండేవారని గుర్తు చేశారు



స్పీకర్. విశాఖపట్నంలో రామానాయుడు స్టూడియో ప్రారంభోత్సవానికి సీఎంగా వచ్చిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి, అప్పటి ప్రతిపక్ష ఎమ్మెల్యే అయిన తనను స్టేజ్‌పైకి ఆహ్వానించి, ప్రోటోకాల్ పాటించలేదని కలెక్టర్‌ను అక్కడే మందలించారని ఆనాటి అనుభవాన్ని స్పీకర్ మీడియాతో పంచుకున్నారు. అప్పట్లో అధికార-ప్రతిపక్ష సభ్యులు సభలో ప్రజా సమస్యలపై పోరాడినా బయట స్నేహంగా ఉండేవారని గుర్తు చేశారు. రాను రాను ఆ సంస్కృతి పోయి విరోధుల్లా తయారవుతున్నారని స్పీకర్ అన్నారు. శాసనమండలి అంటే పెద్దల సభగా.. పెద్ద ఆలోచనలు ఉన్నవారితో నిండి ఉండేదని.. ఇప్పుడు పెద్ద ఆలోచనలు లేని వారు ఉండటం వల్ల ఎలా ఉంటుందో చూస్తున్నామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు.

# పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**విజయనగరం,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):**

విజయనగరం జిల్లా కేంద్రంలోని ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. పరీక్ష వివరాలు, విద్యార్థుల హాజరు తదితర అంశాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పకడ్బందీగా పరీక్షలను నిర్వహించాలని ఆదేశించారు. కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ప్రాథమిక చికిత్సా కేంద్రాన్ని తనిఖీ చేశారు. అందుబాటులో ఉన్న మందుల గురించి కలెక్టర్ ఆరా తీశారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

# నగరాలు,పట్టణాల్లో వసతుల కల్పన

### పెరుగనున్న జానాభాకు అనుగుణంగా సౌకర్యాలు

### తాగునీరు, గృహవసతిపై ప్రత్యేక దృష్టి

### అసెంబ్లీలో మంత్రి నారాయణ వెల్లడి

**అమరావతి,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):**

ఏపీలోని నగరాలు, పట్టణాల్లో జనాభా ప్రస్తుతం 36 శాతం ఉండగా, 2047 నాటికి 60 శాతానికి చేరుతుందని మంత్రి నారాయణ తెలిపారు. దీనికి తగినట్లుగా సదుపాయాలు కల్పించడంపై దృష్టి సారించామని చెప్పారు. గురువారం ఏపీ శాసనసభలో పురపాలకశాఖ బడ్జెట్ రూ.14,538కోట్ల బ్జడెట్ గ్రాంట్ల కోసం అసెంబ్లీలో మంత్రి నారాయణ ప్రతిపాదించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చెత్త సేకరణ, నిర్వహణ, నీటి పునర్వినియోగం, ప్రతి ఒక్కరికీ ఇళ్లు, రోడ్లు, ఆసుపత్రులు, శ్మశానాలు వంటి అంశాలపై దృష్టి సారించామని మంత్రి వివరించారు. ప్రస్తుతం నగరాలు, పట్టణాల్లో 2100 ఎంఎల్‌డీ తాగునీరు సరఫరా చేస్తున్నామని మంత్రి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా డంపింగ్ యార్డుల్లోని చెత్తను పూర్తిగా క్లియర్ చేస్తున్నామని.. జూన్ నాటికి అన్ని డంపింగ్ యార్డులు శుభ్రంగా తయారవుతాయని వెల్లడించారు. గతంలో 5 లక్షల టిడ్కో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించగా.. వైసీపీ అధికారంలోకి వచ్చాక వాటిని 2.65 లక్షలకు కుదించి, రంగులు మార్చిందన్నారు. ఇళ్లు కట్టకుండానే బిల్లులు చేసిందని విమర్శించారు. దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం రూ.4,451 కోట్లు హడ్కో రుణం మంజూరైందని.. ఉగాది నాటికి లక్ష టిడ్కో ఇళ్లు సిద్ధం చేస్తామని మంత్రి తెలిపారు. మున్సిపాలిటీలకు పన్నుల రూపంలో వచ్చిన రూ. 3,500 కోట్లను వైసీపీ దారి మళ్లించిందని మంత్రి ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పన్ను డబ్బులను సంబంధిత మున్సిపాలిటీల్లోనే ఖర్చు చేసుకునేందుకు అనుమతించామని చెప్పారు. విశాఖపట్నం, విజయవాడల్లో మెట్రో పనులు త్వరలో ప్రారంభిస్తామని మంత్రి నారాయణ ప్రకటించారు. ఆపై మున్సిపల్ బడ్జెట్ గ్రాంట్లను శాసనసభ ఆమోదించింది. పరిశుభ్రమైన వాతావరణంలో 205 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశామని మంత్రి వెల్లడించారు. వీటి ద్వారా 3.07 కోట్ల మంది అల్పాహారం, 3.64 కోట్ల మంది భోజనం, 1.59 కోట్ల మంది రాత్రి భోజనం తీసుకున్నారని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో మరో



75 క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. నగరాలు, పట్టణాల్లో భవన నిర్మాణ అనుమతులను సులభతరం చేశామన్నారు. వివిధ శాఖల ఎన్‌ఓసీలను సింగిల్ విండో విధానంలో మంజూరు చేస్తున్నామని చెప్పారు. వైసీపీ హయాంలో టీడీఆర్ బాండ్ల కుంభకోణం జరిగిందని.. తణుకులో రూ. 691 కోట్లు, తిరుపతిలో రూ.147 కోట్లు కుంభకోణాలు జరిగాయని ఆరోపించారు. విజిలెన్స్ విచారణ తర్వాత సమస్య పరిష్కారమవుతుందని మంత్రి తెలిపారు. ÷ాజధాని అమరావతిని వైసీపీ మూడుముక్కలాటతో నాశనం చేసిందని మంత్రి నారాయణ విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చాక కాంట్రాక్టర్ల పాత బిల్లులు క్లియర్ చేశామని, మళ్లీ కొత్త టెండర్లు పిలిచి పనులు అప్పగించామని తెలిపారు. వర్షాలు ముగిసిన తర్వాత పనులు వేగంగా జరుగుతున్నాయని.. రాబోయే మూడేళ్లలో పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అఖిల భారత సర్వీసు అధికారుల భవనాలు ఈ నెలలో పూర్తవుతాయని అన్నారు. మిగతా అధికారుల భవనాలు రెండు నెలల్లో పూర్తి చేస్తామని వెల్లడించారు.

# వెలిగొండ శంకుస్థాపనకు 30 ఏళ్లు

### అనేక ఆరణాలతో ఇప్పటికీ పూర్తి కాని ప్రాజెక్ట్

### తానే శంకుస్థాపన చేసినట్లు చంద్రబాబు వెల్లడి

### మళ్లీ తానే పూర్తి చేస్తానంటూ ఎక్స్ వేదికగా ప్రకటన

**అమరావతి,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):**

వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగి నేటికి 30 ఏళ్లు పూర్తి అయ్యింది. ఈ సందర్భంగా వెలిగొండ ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. కీలక ప్రకటన చేశారు. 30 ఏళ్ల క్రితం 1996 మార్చి 5న తానే ఈ ప్రాజెక్టుకు భూమిపూజ చేసిన రోజును గుర్తుచేస్తూ.. ఇప్పుడు పనులను పూర్తి చేసి నీటిని అందించే అవకాశం తనకే వచ్చిందని సీఎం పేర్కొన్నారు. 1996 మార్చి 5.... ఆ రోజు తనకు ఇంకా గుర్తుందన్నారు సీఎం. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని వెనుకబడిన పశ్చిమ ప్రాంతాల్లో తీవ్రమైన తాగు, సాగునీటి ఎద్దడితో ప్రజలు అల్లాడుతుంటే.. వారి కష్టాలు తీర్చేందుకు 30 ఏళ్ల క్రితం తొలి అడుగు వేశామని చంద్రబాబు గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లో 4.38 లక్షల ఎకరాలకు సాగునీరు, 15 లక్షల మందికి తాగునీరు అందించాలనే లక్ష్యంతో.. జలాశయం ఫోర్‌షోర్ నుంచి 43.50 టీఎంసీల నీటిని వినియోగించుకునే ఆలోచనతో 30 ఏళ్ల క్రితం ఇదే రోజున అంటే 1996 మార్చి 5న ముఖ్యమంత్రిగా తాను వెలిగొండ ప్రాజెక్టుకు భూమిపూజ చేసినట్లు తెలిపారు. అనేక కారణాలతో తరువాత వచ్చిన ప్రభుత్వాల నిర్లక్ష్యానికి బలైన వెలిగొండ పనులను మళ్లీ 2014-19 మధ్య వేగవంతం చేశామన్నారు సీఎం. ప్రాజెక్ట్ కోసం రూ. 1,414 కోట్లు ఖర్చు చేశామని అన్నారు. అయితే తరువాత వచ్చిన ప్రభుత్వం అరకొర పనులతో తీవ్ర నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ప్రాజెక్టు పూర్తి చేయకుండానే ప్రారంభోత్సవం పేరుతో ప్రజలను మోసం చేసి నవ్వులపాలు అయ్యిందని సీఎం అన్నారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెలిగొండ ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చామని సీఎం చంద్రబాబు తెలిపారు. రూ.140 కోట్లతో పెండింగ్ బిల్లులు క్లియర్ చేశామని, రూ.585 కోట్లు నిర్మాణంపై ఖర్చు చేశామని ముఖ్యమంత్రి వివరించారు. హెడ్ రెగ్యులేటర్‌కు సంబంధించి 2,200 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు పూర్తయ్యాయని అన్నారు .రూ.456 కోట్లతో ఫీడర్ కెనాల్ లైనింగ్, రిటైనింగ్ వాల్ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ ఏడాది జులై నాటికి తొలి ఫేజ్ పనులు పూర్తి చేసి వెలిగొండకు కృష్ణా నీళ్లు తీసుకొస్తామని స్పష్టం చేశారు. 2027-28 నాటికి ఫేజ్-2 నిర్మాణం కూడా పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. దశాబ్దాల కలను నిజం చేసి, కరువు ప్రాంతంలో ప్రతీ ఎకరానికి నీళ్లిచ్చి రైతన్న జీవితాలు మారుస్తామని.. హార్టికల్చర్ సాగుతో జీవన ప్రమాణాలు పెంచుతామని చెప్పారు. 'వెలిగొండకు శంకుస్థాపన చేసింది నేనే... పూర్తి చేసి నీళ్లు ఇచ్చేది నేనే' అని సీఎం చంద్రబాబు నాయుడు ట్వీట్ చేశారు.

# చట్టసభలను మత రాజకీయ వేదికగా చేస్తారా

### మండలి ఛైర్మన్‌ను మతం పేరుతో ప్రశ్నిస్తారా

### ఇష్టపిక్రైనా లడ్డూ రాజకీయం మానండి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

**విజయవాడ,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):**

లడ్డూ పేరుతో మతరాజకీయాలు చేసి రాష్ట్ర రాజకీయాలను భ్రష్టు పట్టించవద్దని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. బుధవారం రాష్ట్ర శాసన మండలిలో లడ్డుపై జరిగిన చర్చ సందర్భంగా చైర్మన్ స్థానంలో ఉన్న వ్యక్తిని ఉద్దేశించి మీరు క్రిస్టియన్ అని సంబోధించడం ద్వారా చట్టసభలను మత రాజకీయాలమయం చేసి భ్రష్టు పట్టించటం పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని దారుణంగా అవమానించడమేనని తెలిపారు. ఈ వ్యాఖ్యలను సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకొని భవిష్యత్‌లో మతాన్ని రాజకీయాలకు వాడుకోకుండా నిరోధించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొద్దికాలంగా తిరుమల లడ్డు కల్తీ/అవినీతిపై జరుగుతున్న చర్చ సందర్భంగా ఉద్దేశపూర్వకంగానే మత రాజకీయాలను చొప్పిస్తున్నారని తెలిపారు. అవినీతికి పాల్పడిన వారు ఎవరైనా వారిపై చర్య తీసుకోకుండా వివిధ మతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేయడం గర్హనీయమని తెలిపారు. ఇందుకు అధికార పార్టీతో పాటు ప్రధాన ప్రతిపక్షమూ బాధ్యత వహించాలని పేర్కొన్నారు. సమాజాన్ని విచ్ఛిన్నం చేసే ఇలాంటి రాజ్యాంగ వ్యతిరేక వ్యాఖ్యలను నిరసించాల్సిందిగా రాష్ట్ర ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. సిట్ నివేదిక బయట పెట్టకుండా శాసన మండలి సభ్యులకు ఒకనోటు అందించడం ద్వారా వాస్తవాలను తొక్కిపెట్టాలన్న దుర్బుద్ధి కనిపిస్తోందని తెలిపారు. ఆ నివేదికను బట్టబయలు చేసి దాని ఆధారంగా అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. లడ్డు నాణ్యత తగ్గడానికి, అవినీతికి ఇప్పటివరకు రాష్ట్రాన్ని పాలించిన పార్టీల ప్రభుత్వాలదే బాధ్యతని పేర్కొన్నారు. ఏ చర్యలూ తీసుకోకుండా ప్రజల విశ్వాసాలతో రాజకీయాలు చేయాలనుకోవడం తీవ్రమైన నేరమని, ఇప్పటికైనా ఇలాంటి మత విద్వేష రాజకీయాలను మానుకొని అధికార కూటమి అభివద్ధి, ప్రజా సంక్షేమం, తక్షణ సమస్యల పరిష్కారంపై దష్టి పెట్టాలని డిమాండు చేశారు.

# అమెరికా మరో దుస్సాహసం

### అణు వార్‌హెడ్ క్షిపణి పరీక్ష

**వాషింగ్టన్,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):**

పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల నడుమ అమెరికా భారీ అణు సామర్థ్యం గల క్షిపణి పరీక్ష నిర్వహించడం ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. అమెరికా సైన్యం కాలిఫోర్నియా తీరంలో ఉన్న వాండెన్‌బర్గ్ స్పేస్ ఫోర్స్ బేస్ నుంచి శక్తిమంతమైన మినిట్‌మ్యాన్-3 ను విజయవంతంగా ప్రయోగించింది. ఈ పరీక్షను అమెరికా సాధారణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిందని అధికారులు వెల్లడించారు. ఈ క్షిపణి పరీక్ష సాంటా బార్బరా సమీపంలోని వాండెన్‌బర్గ్ స్పేస్ ఫోర్స్ బేస్ నుంచి నిర్వహించారు. ఈ ప్రయోగంలో నిరాయుధ రాకెట్‌ను ఉపయోగించినట్లు అమెరికా అధికారులు తెలిపారు. ప్రయోగించిన క్షిపణి పసిఫిక్ మహాసముద్రంలో ఉన్న మార్షల్ ఐస్ ల్యాండ్ సమీపంలోని లక్ష్యాన్ని కచ్చితంగా తాకినట్లు అమెరికా స్పేస్ ఫోర్స్ వెల్లడించింది. మినిట్‌మ్యాన్-3 క్షిపణి అమెరికా రక్షణ వ్యవస్థలో కీలక భాగమని అధికారులు తెలిపారు. ఈ క్షిపణి అణు వార్‌హెడ్‌లను మోసుకెళ్లగల సామర్థ్యం కలిగి ఉంటుంది. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో హిరోషిమాపై పడేసిన అణుబాంబుల కంటే 20 రెట్లు శక్తివంతమైన వార్‌హెడ్‌లను మోయగల క్షిపణి అని అధికారులు చెబుతున్నారు. అమెరికా ఎయిర్‌ఫోర్స్ ప్రకారం.. ఈ పరీక్ష పూర్తిగా రక్షణాత్మక ప్రయోజనాల కోసం నిర్వహించిందని అధికారులు తెలిపారు. క్షిపణి వ్యవస్థ కచ్చితత్వం, ప్రభావం, సిద్ధంగా ఉండే చర్యలను పరీక్షించడం ప్రధాన లక్ష్యమని అధికారులు వివరించారు. అలాగే వివిధ మిషన్ ప్రొఫైల్స్ ద్వారా మినిట్‌మ్యాన్-3 వ్యవస్థ పనితీరును మెరుగుపరచడానికి ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమెరికా భూమి ఆధారిత అణు దాడి వ్యవస్థ సిద్ధతను నిర్ధారించుకోవడమే ఈ పరీక్ష ముఖ్య ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు. అంతర్జాతీయ భద్రతా పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో రక్షణ వ్యవస్థలు ఎప్పుడూ సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇటీవల అమెరికా, ఇజ్రాయెల్‌లు కలిసి ఇరాన్‌పై దాడులు చేసిన నేపథ్యంలో ఈ క్షిపణి పరీక్ష జరగడం ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీసింది. అయితే ఈ పరీక్షకు ఆ ఘటనలతో ప్రత్యక్ష సంబంధం లేదని అమెరికా స్పష్టం చేసింది.

# బెంగాల్ గవర్నర్ ఆనందబోస్ రాజీనామా

### రాజకీయ ఒత్తిళ్లు కారణమై ఉండొొచ్చన్న మమత

**కోల్‌కతా,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):**

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్రంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆ రాష్ట్ర గవర్నర్ సీవీ ఆనంద బోస్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ విషయాన్ని పశ్చిమ బెంగాల్ లోక్ భవన్ వర్గాలు వెల్లడించాయి. అయితే, ఆయన రాజీనామాకు గల స్పష్టమైన కారణాలు తెలియరాలేదు. సీవీ ఆనంద బోస్ రాజీనామాపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ స్పందించారు. ఆయన రాజీనామా విషయం తెలిసి తాను షాకయ్యానని చెప్పారు. 'గవర్నర్ రాజీనామాకు గల కారణం ప్రస్తుతానికి నాకు కూడా తెలియదు. ప్రస్తుత పరిస్థితుల్ని చూస్తుంటే నాకేమీ ఆశ్చర్యం అనిపించడం లేదు. త్వరలో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర మంత్రి నుంచి ఆయన మీద రాజకీయపరమైన ఒత్తిడి ఉండొొచ్చు. కొత్త గవర్నర్‌గా తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవిని నియమిస్తున్నట్లు కేంద్ర మంత్రి నుంచి సమాచారం అందింది. గవర్నర్ తొలగింపు, కొత్త గవర్నర్ నియామకంలో కేంద్ర మంత్రి నన్ను సంప్రదించలేదు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. సహకార విధానానికి కేంద్రం తగిన గౌరవం, ప్రాధాన్యం ఇవ్వాలి. రాష్ట్రాల గౌరవాన్ని కాపాడాలని మమత వ్యాఖ్యానించారు. ఇక.. గవర్నర్‌గా రాజీనామా చేసిన సీవీ ఆనంద బోస్ పశ్చిమ బెంగాల్‌లో మూడున్నరేళ్లు సేవలందించారు. ఆయనకు, సీఎం మమతా బెనర్జీకి మధ్య అనేక విబేధాలు తలెత్తాయి. అందువల్లే గవర్నర్ల వ్యవస్థను మమత తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆనంద బోస్ ప్రస్తుతం ఢిల్లీలోనే ఉన్నారు. ఆయన కేంద్ర మంత్రుల్ని తన రాజీనామా విషయంపై సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు త్వరలోనే నోటిఫికేషన్ వెలువడనుంది.



# మిషన్ భగీరథలో మరమ్మత్తులు

### రెండ్రోజులు పాటు నీటి సరఫరా నిలిపివేత

**మెదక్,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):**

వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని తాగునీటి సమస్య పరిష్కారానికి సమ్మర్ యాక్షన్ ఎ÷-లాన్ తయారీకి చర్యలు తీసుకున్నట్లు మిషన్ భగీరథ ఏఈ నాగభూషణం ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా పెద్దరెడ్డిపేట వద్ద పైప్‌లైన్ లీకేజీ మరమ్మతులు, రాయిపహాడ్ వద్ద స్లూయి?సవాల్స్ రిపేర్లు, సివిల్ పనులు, సంపులు శుభ్రపరచడం తదితర నిర్వహణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పనులు పూర్తిచేయడం కోసం సింగూరు నుంచి జిల్లాలకు నీటి సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. మెదక్ నియోజకర్గంలోని 275 నివాస ప్రాంతాలు, మెదక్, రామాయంపేట మున్సిపాలిటీలు, అందోల్ నియోజకవర్గంలోని అల్లాదుర్గం, టేక్మాల్ మండలాల్లోని 80 నివాస ప్రాంతాల పరిధిలో నేడు, రేపు తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వేసవి నిర్వహణ పనుల కోసం చేపడుతున్న ఈ పనులను గుర్తించి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.



# ఇద్దరికంటే ఎక్కువ మందిని కంటే

### కాన్పు సమయంలో 25 వేల ఆర్థిక సాయం

**అమరావతి,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):**

ఏపీ ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఓశుభవార్త తెలిపారు. ఇకపై ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లల్ని కంటే కాన్పు సమయంలో రూ.25వేలు ఇస్తామని గురువారం అసెంబ్లీ సాక్షిగా కీలక ప్రకటన చేశారు. ప్రతి కుటుంబంలోని కుటుంబ సభ్యుల సంఖ్య పెరిగేకొద్దీ వారికి ప్రోత్సాహకాలు ఉంటాయని చంద్రబాబు వెల్లడించారు. ఇప్పటి వరకు కుటుంబ నియంత్రణకు ప్రాధాన్యత ఇచ్చామని, ఇప్పుడు పాపులేషన్ మేనేజ్‌మెంట్ గురించి చర్చిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. పాపులేషన్ మేనేజ్ మెంట్ పాలసీ అమలు చేసిన మొదటి రాష్ట్రంగా ఏపీ నిలుస్తుందని అన్నారు.ప్రస్తుతం 1.5గా ఉన్న టీఎఫ్‌ఆర్‌ను 2.1కు తీసుకువెళ్లడమే ప్రధాన లక్ష్యం అని సీఎం చంద్రబాబు అన్నారు. గతంలో నా మాటలను వ్యతిరేకించిన జేపీ వంటి వారు ఇప్పుడు సమర్థించారు. ఇటీవల ఆర్‌ఎస్‌ఎస్ మోహన్ భగవత్ కూడా పాపులేషన్ గురించి ప్రస్తావించారు. ఇప్పటి మన దేశంలో యూపీ, బీహార్ లో మాత్రమే ఎక్కువ జనాభా ఉన్నారు. 2023 లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఏడాదికి 6.70 లక్షల మంది పిల్లలు మాత్రమే పుడుతున్నారు. ఈ లెక్కన 2047 నాటికి ఏపీలో వృద్ధుల సంఖ్య ఏ స్థాయిలో పెరిగిపోతుందో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు అని అన్నారు.

# ఇరాన్ యుద్ధనౌకప దాడి దారుణం

## తీవ్రంగా ఖండించిన ఇరాన్ మంత్రి

## బదులు తీర్చుకుంటామని హెచ్చరిక

టెహ్రాన్,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):

ఇరాన్‌పై చేస్తున్న పోరులో భాగంగా.. ఆ దేశ యుద్ధనౌక ఐరిస్ దేనా పై అమెరికా దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడిని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తీవ్రంగా ఖండించారు. దీనికి తగిన బదులు తీర్చుకుంటామని హెచ్చరించారు. ఇరాన్‌కు 2000 మైళ్ల దూరంలో సముద్రంలో అమెరికా దారుణానికి పాల్పడిందని అరాగ్చీఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఈ నౌక భారతదేశానికి వెళ్లిన విషయాన్ని గుర్తుచేశారు. అక్కడినుంచి తిరిగివెళుండగా అంతర్జాతీయ జలాల్లో ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా దేనాపై దాడి చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. దీనికి అగ్రరాజ్యం తీవ్రంగా పశ్చాత్తాపపడాల్సిన సమయం త్వరలోనే వస్తుందని హెచ్చరించారు. ఐరిస్ దేనా-75పై అమెరికా జలాంతర్గామితో దాడి చేసి ముంచేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో నౌకలో 180 మంది సిబ్బంది ఉన్నారు. శ్రీలంక భద్రతా దళాలు కొందరిని రక్షించగా, 87 మృతదేహాలను స్వాధీనం చేసుకున్నాయి. ఇరాన్‌లోని బందర్ అబ్బాస్ పోర్టులో భారీ పేలుళ్లు వినిపించాయి. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ నేవీ స్థావరంపై దాడి జరిగినట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇది అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధికి సమీపంలో ఉంటుంది. పేలుళ్ల కారణంగా జరిగిన నష్టం గురించి ఇంకా తెలియరాలేదు.

# ఇంటర్‌లో మాల్ ప్రాక్టీస్‌కు ఐదుగురు పట్టివేత

హైదరాబాద్,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):

రాష్ట్రంలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి . గురువారం ఇంటర్ మొదటి సంవత్సరం జ్యూలజీ , హిస్టరీ పరీక్షలు జరిగాయి . ఈ పరీక్షలో 5 గురు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్ చేస్తూ పట్టుబడ్డారు. పెద్దపల్లి జిల్లాలో ముగ్గురు, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాలో ఒక్కొక్కరు చొప్పున పట్టుబడ్డారని అధికారులు వివరించారు. గురువారం నాటి పరీక్షలో మొత్తం 4,29,600 మంది విద్యార్థులకు గాను 4,17,656 మంది హాజరయ్యారు. 11,944 మంది గైర్హాజరయ్యారని పరీక్షల అధికారులు వివరించారు.

# నిర్మాణ భవనం వద్ద ప్రమాదం

## కర్రలు కూలి కిందపడ్డ ముగ్గురు మృతి

హైదరాబాద్,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ )

: హైదరాబాద్ నగరంలోని టోలిచౌకిలో ఘోర ప్రమాదం జరిగింది. అల్ హస్నాత్ కాలనీలో భవన నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన గోవా కర్రలు కూలిపోవడంతో పై నుంచి కిందపడి ముగ్గురు కార్మికులు మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. నూతన భవనానికి గోవా కర్రలు కట్టి వాటిపై నిలబడి పనులు చేస్తుండగా ఒక్కసారిగా కట్టెలు కూలడంతో ఈ ప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారంతో పోలీసులు, రెస్క్యూ టీమ్ అక్కడికి చేరుకొని సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడ్డ వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# అర్జున్ టెండూల్కర్ వివాహం

## హాజరైన లోకేశ్,బ్రాహ్మణి దంపతులు

ముంబై,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):

మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్ వివాహం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సతీమణి బ్రాహ్మణితో కలిసి హాజరయ్యారు. వీరిని సచిన్ టెండూల్కర్ కుటుంబం సాదరంగా స్వాగతించింది. అనంతరం.. ఈ కార్యక్రమానికి హాజరైన రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీతో లోకేశ్, బ్రాహ్మణిలు మాట్లాడారు. వివాహ వేడుకలో పాల్గొనడం కోసం లోకేశ్ దంపతులు గురువారం ఉదయం ముంబైకి బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా నారా లోకేశ్ దంపతులు నవ వధూవరులైన అర్జున్ టెండూల్కర్, సానియా చందోక్‌లను ఆశీర్వదించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వీరితో పాటు దేశవ్యాప్తంగా ఉన్న పలువురు ప్రముఖులు కూడా ఈ వివాహ వేడుకకు హాజరయ్యారు. మాజీ క్రికెటర్లు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు కలిసి ఈ వేడుకను మరింత వైభవంగా మార్చారు. కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు అర్జున్ - సానియాలకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.వీరితో పాటు దేశవ్యాప్తంగా ఉన్న పలువురు ప్రముఖులు కూడా ఈ వివాహ వేడుకకు హాజరయ్యారు.

# ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ

## కడియం విచారణ పూర్తి...

## దానం విచారణ 7కు వాయిదా

హైదరాబాద్,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):

పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ కొనసాగుతోంది. గురువారం కడియం శ్రీహరిని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారించారు. కొన్ని గంటలపాటు సాగిన ఈ విచారణ ముగిసింది. మరో ఎమ్మెల్యే దానం నాగేందర్ విచారణ పూర్తి కాలేదు. ఆయన విచారణను శనివారానికి అంటే.. మార్చి 7వ తేదీకి వాయిదా వేశారు. ఈ కేసులో శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు విచారణకు హాజరు కావాలని ఇరు వర్గాలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ రావు సూచించారు. దీంతో ఈ పిటిషన్లను స్పీకర్ శనివారం విచారించనున్నారు. పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొన్న పలువురి ఎమ్మెల్యేల విచారణ ఇప్పటికే పూర్తయింది. వారందరికి స్పీకర్ గడ్డం ప్రసాద్ క్లీన్ చీట్ ఇచ్చిన విషయం విదితమే. ఈ కేసులో ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను విచారించాల్సి ఉంది. ఆయన విచారణ కూడా పూర్తయితే.. ఈ ఫిరాయింపుల వ్యవహారం ఒక కొలిక్కి వస్తుంది.

# స్థానిక సంస్థల స్వావలంబనకు కట్టుబడి ఉన్నాం

## జిల్లాల ప్రాతిపదికనే జడ్పీ ఎన్నికల నిర్వహణ

## డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడి



అమరావతి,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా జడ్పీ ఎన్నికలను విభజించిన జిల్లాల ప్రాతిపదికన నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు .. ఇందుకు అనుగుణంగా కసరత్తు జరుగుతోందని.. పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పంచాయతీల పునర్విభజనపైనా న్యాయపరమైన అడ్డంకులు ఏవీ లేవని చెప్పారు. 'స్థానిక సంస్థల స్వావలంబనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అసెంబ్లీ లో స్పష్టం చేశారు పవన్. అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక సంస్థలను బలోపేతం చేసే చర్యలను తీసుకున్నాం అన్నారు.. అలాగే రహదారుల విస్తరణ, ఇతర అభివృద్ధి కార్యక్రమాల కోసం చెట్లను తొలగించేటప్పుడు అక్కడ ఎలాంటి ప్రత్యామ్నాయం తీసుకురావాలనే దానిపై పరిశీలన జరుపుతున్నాం అన్నారు.. పర్యావరణ ప్రేమికుడిగా ఈ విషయంలో అన్ని వైపులా ఆలోచించి పచ్చదనాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకుంటాం అన్నారు.. కేవలం చర్యలు తీసుకోవడమే కాదు.. భవిష్యత్తులోనూ చెట్లను, వృక్షాలను సంరక్షించేలా బలమైన చట్టం తీసుకొచ్చేందుకు ఆలోచిస్తున్నాం అన్నారు.. ఇది కఠినంగా అమలు చేస్తేనే పచ్చదనానికి భరోసా దొరుకుతుందన్నారు పవన్ కల్యాణ్. నాటే ప్రతి మొక్కకు జియో ట్యాగ్ అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలను నాటుతున్నారు తప్పితే.. వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవడం లేదన్నారు పవన్? సభ్యులు నా దృష్టికి తీసుకొచ్చారు. పచ్చదనం సంరక్షణకు సభ్యుల నిశిత దృష్టిని అభినందిస్తున్నాను. అదే విధంగా ఇక మీదట అటవీ శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేసే వాటికి, నాటే ప్రతి మొక్కకు జియో ట్యాగ్ వేసే పక్రియ అమలు చేయాలని భావిస్తున్నాం అన్నారు పవన్? నర్సరీల దగ్గర నుంచే దీనికి ప్రత్యేక వ్యవస్థను అమలు చేసేలా ఓ ప్రత్యేక వ్యవస్థను తీసుకువస్తాం. అన్నారు.. బెంగళూరు నర్సరీల్లో అమలు చేస్తున్న అత్యాధునిక విధానాలను పరిశీలిస్తున్నాం.అన్నారు పవన్.. మొక్కలు నాటడమే కాదు.. వాటి సంరక్షణకు తగిన ప్రాధాన్యం ఇస్తాం అన్నారు.

# పోలీసులతో గస్తీ ముమ్మరం

## రాత్రి వేళల్లో కాలనీల్లో పర్యటన

హైదరాబాద్,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):

విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఫుట్ పెట్రోలింగ్‌ను మరింత బలోపేతం చేసే దిశగా పోలీసులు వినూత్న కార్యాచరణ చేపట్టారు. కేవలం పెట్రోలింగ్ వాహనాల గస్తీకే పరిమితం కాకుండా, ప్రజల మధ్యకు నేరుగా నడుచుకుంటూ వెళ్తూ 'మేమున్నం' అనే భరోసా కల్పించే విధంగా ఈ కొత్త విధానానికి శ్రీకారం చుట్టారు. ప్యాట్రోల్ కార్లు, బ్లూ కోల్ట్ సిబ్బంది తమ వాహనాలను నిలిపివేసి, నిత్యం ప్రజలతో మమేకమవుతూ జనసంచారం అధికంగా ఉండే ప్రధాన రహదారులు, మార్కెట్ ప్రాంతాలు, బస్టాండ్‌లు, నివాస కాలనీలు, చిన్న చిన్న వీధుల్లో పోలీసులు కాలినడకన పర్యటిస్తూ క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తున్నారు. ప్రజలతో నేరుగా మాట్లాడి అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు గమనించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు. ప్రజల్లో భద్రతా భావనను పెంపొందించడం, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించడం, అనుమానితులను తనిఖీ చేయడమే లక్ష్యంగా ఈ ఫుట్ పెట్రోలింగ్‌ను పోలీసులు సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. దీనివల్ల రాత్రి వేళల్లో సామాన్య ప్రజల్లో ధైర్యం పెరగడమే కాకుండా, నేరస్థుల్లో భయం కలుగుతోంది. క్షేత్రస్థాయిలో స్థానికులతో నేరుగా సంభాషించడం ద్వారా కమ్యూనిటీ పోలీసింగ్‌ను బలోపేతం చేస్తూ, నేర నియంత్రణకు పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ప్రజల రక్షణెళి ధ్యేయంగా ఈ ఫుట్ పెట్రోలింగ్ నిరంతరం కొనసాగుతుందని అధికారులు తెలిపారు. బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్ సిబ్బంది వాహనాలను పక్కన పెట్టి, మార్కెట్లు, బస్టాండ్‌లు మరియు నివాస ప్రాంతాల్లో కాలినడకన పర్యటిస్తున్నారు. వాహనాలు వెళ్లలేని ఇరుకైన సందుల్లో కూడా పోలీసులు తిరగడం వల్ల అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పడుతోంది. రాత్రి వేళల్లో పనిచేసే కార్మికులు, వ్యాపారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. అనుమానాస్పద కదలికలు ఉంటే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. రాత్రి వేళల్లో కారణం లేకుండా తిరిగే వారు, పాత నేరస్థుల వివరాల సేకరిస్తారు. నిర్మానుష్య ప్రాంతాలలో మద్యం సేవించే వారి కట్టడి, అసాంఘిక కార్యకలాపాల కట్టడికి పూనుకొంటారు. నంబర్ ప్లేట్ సరిగ్గా లేని, అనుమానాస్పదంగా ఉన్న వాహనాలు తనిఖీ చేస్తారు. ప్రజల మధ్య ఉండటం వల్ల పోలీసులపై ప్రజల్లో భరోసా భావం పెరుగుతుంది. స్థానికులతో స్నేహపూర్వకంగా ఉండడం వల్ల ఒక్కోసారి నేరాలకు సంబంధించిన ముందస్తు సమాచారం తెలుసుకునే వీలుంది. కొత్తంగా కాలినడక గస్తీ వల్ల ప్రజలతో నేరుగా మాట్లాడే అవకాశం లభించడం ద్వారా పోలీసులకు స్థానిక పరిస్థితులపై స్పష్టమైన అవగాహన ఏర్పడుతోందని పోలీసులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలతో సన్నిహిత సంబంధాలు ఏర్పడటం వల్ల ముఖ్య సమాచారం త్వరగా అందుకునే వీలుందన్నారు. ప్రజల భద్రత కేవలం పోలీసుల బాధ్యతే కాదు, పౌరుల సహకారం కూడా అంతే ముఖ్యం. మీ పరిసరాల్లో ఏవైనా అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే వెనుకాడకుండా పోలీసులకు సమాచారం అందించండి. దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి సమయాల్లో పోలీసులు నిర్వహిస్తున్న ఈ ఫుట్ ప్యాట్రోలింగ్ సరికొత్త ఒరవడిని సృష్టించింది.

# తెలుగు రాష్ట్రాల్లో టెన్త్ పరీక్షలకు రెడీ

## కాళేశ్వరం కమిషన్ ఏర్పాటులో దురుద్దేశ్యం లేదు

## హైకోర్టుకు వివరించిన తెలంగాణ ప్రభుత్వం

## అవతకవకలు, డబ్బు దుర్వినియోగంపైనే దృష్టి

## తదుపరి విచారణ 12కు వాయిదా వేసిన కోర్టు

హైదరాబాద్,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):

కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కమిషన్ ఏర్పాటు వెనుక ఎలాంటి దురుద్దేశం లేదని రాష్ట్ర ప్రభుత్వం అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి హైకోర్టుకు స్పష్టం చేశారు. ఈ కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో ప్రజాధనం దుర్వినియోగమైందని తెలిపారు. ఎవరినో టార్గెట్ చేసేందుకు జస్టిస్ పి.సి. ఘోష్ కమిషన్ ఏర్పాటు చేయలేదని హైకోర్టు దృష్టికి తీసుకు వెళ్లారు. గురువారం కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్ ఏర్పాటు.. అందించిన నివేదికపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఏజీ, పిటిషనర్ తరఫు న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. కమిషన్ నివేదిక ఆధారంగానే చర్యలు తీసుకుంటారని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో లాభం కంటే నష్టమే ఎక్కువ జరిగిందని స్పష్టం చేశారు. కాళేశ్వరం నిర్మాణంలో అధికార దుర్వినియోగం జరిగిందని హైకోర్టుకు ఏజీ వెల్లడించారు. ఇక పిటిషనర్ తరఫు న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ.. పలువురిపై కమిషన్ తప్పుడు అభియోగాలు నమోదు చేసిందన్నారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణంలో బిజినెస్ రూల్స్ ఎక్కడా ఉల్లంఘించ లేదని స్పష్టం చేశారు. నిబంధనలకు అనుగుణంగానే కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టినట్లు పిటిషనర్ తరుపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కేసీఆర్‌ను సాక్షిగా పిలిచి దోషిగా ఆరోపణలు చేయడం సరికాదంటూ న్యాయవాది తన వాదనలు వినిపించారు. తప్పుడు విధానంలో కమిషన్ నోటీసులు ఇచ్చిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ స్థల మార్పిడి, ప్రాజెక్ట్ ఖర్చు అంచనాతోపాటు నిర్మాణ సంస్థలకు ఇవ్వడంలో ఎవరు లబ్ది పొందలేదన్నారు. ఈ కాళేశ్వరం కమిషన్ నివేదిక చెల్లదని.. దీనిపై స్టే ఇవ్వాలని హైకోర్టును పిటిషనర్ న్యాయవాది కోరారు. ఈ వాదనలు విన్న హైకోర్టు.. తదుపరి విచారణ మార్చి 12వ తేదీకి హైకోర్టు వాయిదా వేసింది.

# శాసనమండలిలో మరోమారు గందరగోళం

## అచ్చన్నాయుడు క్షమాపణలకు వైసిపి డిమాండ్

## గత వైసిపి లడ్డూ కల్తీ నివేదికలు తొక్కిపెట్టిందన్న ఆనం

## గందరగోళం

## మధ్యే సభను వాయిదా వేసిన చైర్మన్

అమరావతి,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):

తీవ్ర గందరోగళం మధ్య శాసనమండలి శుక్రవారానికి వాయిదా పడింది. సభను వాయిదా వేస్తున్నట్లు ఛైర్మన్ మోషెన్ రాజు ప్రకటించారు. శాసనమండలిలో మరోసారి గందరగోళం నెలకొంది. తిరుమల నెయ్యి కల్తీ అంశంపై లఘు చర్చ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఈ అంశంపై వివరణ ఇస్తుండగా వైసీపీ సభ్యులు ఆందోళనకు దిగారు. మంత్రి వివరణ సమయంలోనే మతాల ప్రస్తావన చేసిన అచ్చెన్నాయుడిని మంత్రి పదవి నుంచి తొలగించాలని వైసీపీ సభ్యులు నినాదాలు చేశారు. వైసీపీ సభ్యులు చైర్మన్ పోడియం పైకి ఎక్కి నిరసన చేయడంతో సభను కొద్దిసేపు వాయిదా వేశారు చైర్మన్. బుధవారం చైర్మన్‌పై అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో వచ్చిన పోస్టులపై వైసీపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. దీనిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని వైసీపీ సభ్యుడు అప్పిరెడ్డి డిమాండ్ చేశారు. అప్పిరెడ్డి డిమాండ్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని చైర్మన్ ఆదేశాలు ఇచ్చారు. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు అభ్యంతరం వ్యక్తం చేశారు. తాను చైర్మన్‌ను ఉద్దేశించి నిన్న చేసిన వ్యాఖ్యలపై వెంటనే వివరణ ఇచ్చానని మంత్రి చెప్పారు. 'పోస్టులు పెట్టేది వాళ్లే, ప్రస్తావించేది వాళ్లే' అని వైసీపీ సభ్యులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అయితే, నిన్న వైసీపీ అధినేత జగన్ క్రిస్టియన్ అని తాను చేసిన వ్యాఖ్యలపై ఇంతవరకు సమాధానం లేదని, ఆ వ్యాఖ్యలకు తాను ఇప్పటికీ కట్టుబడి ఉన్నానని మంత్రి స్పష్టం చేశారు. అచ్చెన్నాయుడు వ్యాఖ్యలపై వెంటనే క్షమాపణ చెప్పాలని వైసీపీ డిమాండ్ చేసింది. వైసీపీ సభ్యులు చైర్మన్ పోడియంను చుట్టుముట్టారు. నిరసన మధ్యనే లడ్డూ అంశంపై మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వివరణ ఇచ్చారు. తిరుమల లడ్డూ కల్తీ జరిగిందని నివేదికలన్నీ చెబుతున్నా.. వైకాపా సభ్యులు దుష్ప్రచారాలు చేస్తున్నారని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. తిరుమల లడ్డూపై స్టేట్‌మెంట్ ఇచ్చే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వైకాపా సభ్యులు నినాదాలు చేశారు. గందరగోళ పరిస్థితి తలెత్తడంతో మండలి ఛైర్మన్ మోషేను రాజు సభను శుక్రవారానికి వాయిదా వేశారు.'జగన్ నాయకత్వంలో నివేదికలను తొక్కిపెట్టిన విషయం అందరికీ తెలుసు. టెండర్లన్నీ మార్చి నిబంధనలను తుంగలో తొక్కారు. తమకు అనుకూలంగా నిబంధనలను మార్చుకున్నారు. కల్తీ జరగడం వాస్తవమేనని వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి ఒప్పుకొన్నారు కదా. ఆనాటి తితిదే ఛైర్మన్లే ఒప్పుకొన్నప్పటికీ.. వైకాపా నేతలు మాత్రం ఒప్పుకోవడం లేదు. వాస్తవాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉంది' అని ఆనం అన్నారు. అయినప్పటికీ వైసీపీ నిరసనలు కొనసాగడంతో చైర్మన్ సభను కొద్దిసేపు వాయిదా వేశారు. అనంతరం కూడా సభ ఆర్డర్‌లో లేకపోవడంతో నేటికి వాయిదా వేశారు.

# ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ

## దిగుమతుల సుంకాలను తిరిగి చెల్లించాల్సిందే

### అమెరికన్ ట్రేడ్ కోర్టు తీర్పు

వాషింగ్టన్,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. దిగుమతులపై విధించిన సుంకాలను తిరిగి చెల్లించాల్సిందేనని ట్రేడ్ కోర్టు తీర్పు ఇచ్చింది. ఇటీవల 1977 అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం కింద ట్రంప్ విధించిన భారీ టారిఫ్‌లను సుప్రీం కోర్టు రద్దు చేసింది. ఇకపై ఈ టారిఫ్‌ల వసూళ్లు నిలిపివేయాలని కోర్టు అధికారులకు ఆదేశించింది. అయితే, ఇప్పటికే వసూలు చేసిన సుంకాలను తిరిగి ఇవ్వాలా లేదా అన్న అంశంపై స్పష్టత ఇవ్వలేదు. తాజాగా ట్రేడ్ కోర్టు తీర్పుతో ఆ విషయంపై స్పష్టత వచ్చింది. అట్మస్ ఫిల్ట్రేషన్ అనే సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి రిచర్డ్ ఈటన్, ఈ సుంకాలు చెల్లించిన దిగుమతిదారులు రీఫండ్ పొందేందుకు అర్హులని పేర్కొన్నారు. అలాగే టారిఫ్‌ల రీఫండ్‌కు సంబంధించిన కేసులను తానే పర్యవేక్షిస్తానని తెలిపారు. అమెరికాలోకి దిగుమతయ్యే వస్తువులపై విధించిన సుంకాలు సాధారణంగా 'లిక్విడేషన్' అనే ప్రక్రియ ద్వారా ఖరారు అవుతాయి. ఈ ప్రక్రియలో కస్టమ్స్ అధికారులు నిర్ణయించిన సుంకాలపై దిగుమతిదారులు అభ్యంతరం వ్యక్తం చేయడానికి 180 రోజుల గడువు ఉంటుంది. ఆ గడువు దాటితే నిర్ణయించిన మొత్తాన్ని చెల్లించాల్సిందే. ఇప్పటికే లిక్విడేషన్ ప్రక్రియ పూర్తయిన దిగుమతుల విషయంలో కూడా టారిఫ్‌లు లేకుండా కొత్తగా లెక్కలు చేయాలని సూచించింది. ఇదిలా ఉండగా, ప్రపంచ దేశాలపై సుమారు 15 శాతం వరకు కొత్త సుంకాలను విధించే ప్రతిపాదన ఈ వారం అమల్లోకి రావొచ్చని అమెరికా ఆర్థిక శాఖ కార్యదర్శి స్కాట్ బెసెంట్ తెలిపారు.

# అమెరికా కోసం భరాత నావికాదళం

## అమెరికా మాజీ ఆర్మీ కల్నల్ డగ్లస్ మాక్‌గ్రెగర్

### వార్తలను తిప్పికొట్టిన భారత ప్రభుత్వం

న్యూఢిల్లీ,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):

మధ్యప్రాచ్యంలో కొన్ని రోజులుగా భీకర యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఇరాన్‌పై దాడుల కోసం అమెరికా నావికాదళం భారత నౌకలను ఉపయోగిస్తోందంటూ విస్తృతంగా జరుగుతున్న ప్రచారాలను కేంద్రం ఖండించింది. ఆ ఆరోపణలు పూర్తిగా అవాస్తవం, నిరాధారమని కేంద్ర విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. అమెరికా మాజీ ఆర్మీ కల్నల్ డగ్లస్ మాక్‌గ్రెగర్ ఇటీవల ఓ ఛానల్ ఇంటర్వ్యూ సందర్భంగా మాట్లాడుతూ.. 'గల్ఫ్ ప్రాంతంలో అమెరికా సైనిక స్థావరాలపై ఒత్తిడి పెరగడంతో మా నావల్ బేస్‌లు ధ్వంసమయ్యాయి. మా నౌకాశ్రయ సదుపాయాలూ ధ్వంసమయ్యాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో మేము భారత్, ఆ దేశానికి చెందిన నౌకాశ్రయాలపై ఆధారపడాల్సి వస్తోంది. ఇది సరైన మార్గం కాదు. అయినప్పటికీ పరిస్థితుల ప్రభావం కారణంగా అలా చేయక తప్పడం లేదు' అని మాక్‌గ్రెగర్ అన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం కావడంతో ఈ వివాదం చెలరేగింది. దీనిపై స్పందించిన కేంద్ర విదేశాంగ శాఖ ఫ్యాక్ట్‌చెక్ విభాగం.. ఆ వ్యాఖ్యలను పూర్తిగా ఖండించింది. 'భారత పోర్టులు అమెరికా దాడులకు ఉపయోగిస్తున్నాయన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదు' అని 'ఎక్స్' వేదికగా ప్రకటించింది. నిర్ధారణ లేని సమాచారం సోషల్ మీడియాలో పోస్ట్ చేయొద్దని హెచ్చరించింది.

# మరోమారు సోనూసూద్ ఉదారత

## గల్ఫ్‌లో చిక్కుకున్న వారికి వసతి సైకర్యం ఆఫర్


ముంబై,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):

కరోనా కష్టకాలంలో నటుడు సోనూసూద్ దేశవ్యాప్తంగా ప్రజలను ఎంతగా ఆదుకున్నారో తెలిసిందే! వలస కార్మికులకు అండగా నిలిచారు. ఎంతో మందికి ఉపాధి చూపించారు. విదేశాల్లో చిక్కుకున్న వారిని ప్రత్యేక విమానాల ద్వారా తమ ఇళ్లకు చేర్చారు. ఇలా ఆపదలో ఉన్న వారికి 'నేనున్నా' అంటూ అండగా నిలుస్తూ.. తనలోని మానవత్వాన్ని చాటుకున్నారు. ఇప్పుడు యుద్ధ పరిస్థితుల కారణంగా విమాన సర్వీసులు రద్దు కావడంతో దుబాయ్‌లో చిక్కుకుపోయిన ప్రయాణికులకు ఆయన సాయం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అక్కడ ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఉచితంగా వసతి కల్పిస్తామని ప్రకటన చేశారు. ఏ దేశస్థులైనా సరే, ఎలాంటి షరతులు లేకుండా ఈ సదుపాయం ఉపయోగించుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేశారు. 'కష్ట సమయంలో మనసున్న మనిషిగా ముందుకు రావడం ఎంతో అవసరం. సహాయం అవసరమైనవారు ఇన్‌స్టాగ్రామ్ వేదికగా డిటైల్స్‌తో మెసేజ్ చేయండి. మా టీమ్ తక్షణమే స్పందిస్తారు' అని ఆయన పోస్ట్‌లో పేర్కొన్నారు. తనను సంప్రదిస్తే వారికి అక్కడే ఉచిత వసతిని సమకూరుస్తానని ప్రకటించారు.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

ముంబై,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):

ఇరాన్ యుద్ధం కారణంగా బంగారం ధరలు భారీగా పతనం అవుతున్నాయి. రోజురోజుకు తగ్గుతూ ఉన్నాయి. తాజాగా దేశీయ మార్కెట్‌లో పసిడి, వెండి ధరలు భారీగా పడిపోయాయి. గురువారం ఉదయం 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.980 తగ్గి.. రూ.1,63,530 వద్ద ట్రేడ్ అవుతోంది. 22 క్యారెట్ల బంగారం ధర కూడా భారీగానే తగ్గింది. 10 గ్రాములకు రూ.900 తగ్గి.. 1,49,900 పలుకుతోంది. ఇక బుధవారం 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 1,64,510 రూపాయలు..10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 1,50,800 రూపాయలు..10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర 1,23,380 రూపాయలు పలికింది. ఇరాన్-అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం ప్రభావంతో అంతర్జాతీయ గోల్డ్ మార్కెట్‌లో అనిశ్చితి నెలకొంది. ఫలితంగా దేశీయ మార్కెట్‌లో ధరలు భారీగా పతనం అయ్యాయి. హైదరాబాద్ నగరంలో 24, 22,18 క్యారెట్ల బంగారం ధరలు భారీగా తగ్గాయి. 24 క్యారెట్ బంగారంపై 980 రూపాయలు.. 22 క్యారెట్ బంగారంపై 720 రూపాయలు.. 18 క్యారెట్ల బంగారంపై 780 రూపాయలు తగ్గింది. ప్రస్తుతం 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం 1,63, 530 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం 1,49, 900 దగ్గర ట్రేడ్ అవుతోంది..10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం 1,22,650 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. రానున్న రోజుల్లో బంగారం ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.



# ఆశా కార్యకర్తల చలో విజయవాడ

## ధర్నాచౌక్ వద్ద ఆందోళన

విజయవాడ,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆశా వర్కర్ల 'ఛలో విజయవాడ' కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద ప్రారంభమైంది. విజయవాడకు చేరుకోకుండా అనేక చోట్ల ఆశాలను అడ్డుకున్నప్పటికీ వెనుకడుగు వేయకుండా చలో విజయవాడ కార్యక్రమానికి ఆశా వర్కర్లు భారీగా తరలివచ్చారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, అన్ని రకాల సెలవులు కల్పించాలని, ప్రభుత్వమే ఆశాలను నియమించాలని, నాణ్యమైన మొబైల్ ఫోన్లు, యూనిఫోమ్స్ ఇవ్వాలని, పెరుగుతున్న జనాభా అనుగుణంగా ఆశా వర్కర్ల సంఖ్యను పెంచాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, రూ.10 గ్రూపు ఇన్సూరెన్స్ కల్పించాలని, తదితర నినాదాలతో ధర్నా చౌక్ దద్దరిల్లింది.

# తెలంగాణలో వాతావరణ మార్పులు

## మూడో వారంలో పిడుగులతో కూడిన వర్షాలు

హైదరాబాద్,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):

తెలంగాణలో మార్చి నెల చివరలో అకాల వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వెదర్ మ్యాన్ వెల్లడించారు. ఈ నెల మధ్యలో అంటే 18, 19 తర్వాత ఉరుములు మెరుపులు, పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించారు. అయితే అప్పటివరకు ఎండలు ఇదేస్థాయిలో కొనసాగుతాయని వెదర్ మ్యాన్ చెప్పారు. ఈస్ట్ తెలంగాణ జిల్లాల్లో ఏకంగా 39 నుంచి 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని తెలిపారు. హైదరాబాద్‌లో 36 నుంచి 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వెల్లడించారు.

# నేటి నుంచి ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక

హైదరాబాద్,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):

'ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈనెల 6 నుంచి 15 వరకు పది రోజులపాటు అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించనున్నట్టు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ తెలిపింది. నేటి నుంచి ఈ డ్రైవ్ కొనసాగనుంది. గ్రామీణ స్థాయిలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడంతోపాటు, పరిశుభ్రత, పాలనా సామర్థ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నది. ఈ మేరకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్‌కుమార్ బుధవారం ఉత్వర్వులు జారీ చేశారు. పది రోజుల కార్యక్రమాల పర్యవేక్షణకు ప్రత్యేక నోడల్ సెల్‌ను ఏర్పాటు చేయాలని, ప్రతిరోజూ పురోగతి నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. '6న ఉమ్మడి జిల్లా స్థాయిలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అధ్యక్షతన సన్నాహక సమావేశాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. మంచి పనితీరు కనబర్చిన కార్యాలయాలు, సంస్థలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు పత్రాలు అందించాలని' ఉత్తర్వులో ఆయన వెల్లడించారు.

# అగ్నిమాపక బిల్లుకు మండలి ఆమోదం

అమరావతి,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):

ఏపీ అసెంబ్లీలో ఆమోదం పొందిన రెండు బిల్లులకు శాసన మండలి ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక సేవల సవరణ బిల్లు-2026ని శాసన మండలి ఆమోదించింది. అగ్నిమాపక వ్యవస్థను ఆధునికీకరణ చేసి మరింత బలోపేతం చేయడం కోసం చట్ట సవరణ చేసింది. అగ్నిమాపక వ్యవస్థలో పలు సంస్కరణలు అమలు చేస్తూ చట్ట సవరణకు శాసన మండలి ఆమోదం తెలిపింది. అగ్నిప్రమాదాల విషయంలో నిర్లక్ష్యం వహించిన యజమానులపై కఠిన జరిమానా విధిస్తామని శాసన మండలి హెచ్చరించింది. ఈ బిల్లులో లోపాలను సవరిస్తూ చట్ట సవరణ చేసింది. ఆంధ్రప్రదేశ్ జన విశ్వాస్ సవరణ బిల్లు 2006-కు శాసన మండలి ఆమోదం తెలిపింది. మారుతున్న కాలానికి అనుగుణంగా సవరణలు చేస్తూ చట్టసవరణకు ఆమోదించింది. వాడుకలో ఉన్న కొన్ని చట్టాలు రద్దు చేసి కొత్త చట్టంలో సవరణలు చేస్తూ శాసన మండలి ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది.

# హైదరాబాద్‌లో మరో రియల్ మోసం

## ప్లాట్ల పేరుతో జనానికి కుచ్చుటోపీ

హైదరాబాద్,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):

హైదరాబాద్ లో మరో రియల్ ఎస్టేట్ మోసం వెలుగులోకి వచ్చింది. అపార్ట్‌మెంట్ల నిర్మాణం పేరుతో వందల కోట్ల రూపాయలకు కుచ్చుటోపీ పెట్టింది త్రిపురా కన్స్ట్రక్షన్స్. దీంతో పోలీసులు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పసుపులేటి సుధాకర్ అతని భార్యను అరెస్ట్ చేశారు . మరోవైపు సుధాకర్ కూతురు అల్లుడు పరారీలో ఉన్నారు. నెల్లూరు జిల్లా కావలకు చెందిన పసుపులేటి సుధాకర్ ఐదవ తరగతి వరకే చదువుకున్నాడు. భవన నిర్మాణ కార్మికుడిగా సెంట్రింగ్ మేస్త్రిగా పని చేశాడు. నెల్లూరులో బతకలేక తెలంగాణకు మకాం మార్చాడు. ఇళ్ల నిర్మాణంలో కిటుకులు నేర్చుకున్నాడు. అంచలంచలుగా ఎదిగాడు. త్రిపురా కన్స్ట్రక్షన్స్ కంపెనీ పెట్టాడు. కోట్ల రూపాయలు కళ్ళరా చూశడు. కావలిలో 100 ఎకరాలకు పైగా భూములు కొనుగోలు చేశాడు. డబ్బుకు కొదువ లేదు. కాబట్టి పొలిటీషియన్ కావాలనుకున్నాడు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఎన్నికల్లో పోటీకి చకచక పావులు కదిపాడు.2019లో జనసేనలో చేరిన సుధాకర్ కావలి నియోజక వర్గం నుంచి పోటీ చేశాడు. కోట్ల రూపాయలు ఖర్చు చేసిన గెలవలేకపోయాడు. తిరిగి హైదరాబాద్ కు చేరుకొని కొద్ది రోజులు బీజేపీలో చేరాడు. తర్వాత కోట్ల రూపాయలు ఫండింగ్ చేస్తానంటూ టీడీపీ, వైసీపీ ముఖ్యనేతలతో లాబీయింగ్ చేశాడు. కానీ అవేవి పని చేయలేదు. దీంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగితే డిపాజిట్ కూడా రాలేదు. 2019, 2024 ఎన్నికల్లో దాదాపు 150 కోట్ల రూపాయలు ఖర్చు చేశాడు సుధాకర్. అప్పటివరకు తాను సంపాదించిన దానితో పాటు ప్లాట్ల పేరుతో జనం నుంచి వసూలు చేసిన డబ్బును కూడా ఎన్నికలలో ఖర్చు పెట్టేసాడు. దీనితో ఇంకేముంది జనం ముందు దోషిగా నిలబడ్డాడు. పసుపులేటి సుధాకర్ పై గతంలో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ నయీంకి బినామిగా పని చేశాడనే ఆరోపణలు కూడా ఉన్నాయి. అలాగే కొందరు ప్రముఖ రాజకీయ నేతలతో సన్నిహిత సంబంధాలను అడ్డం పెట్టుకొని త్రిపురా కన్స్ట్రక్షన్స్ కంపెనీని ఏర్పాటు చేశాడు. అయితే ప్లాట్ల విక్రయాల్లో జనం నెత్తిన కుచ్చుటేపి పెట్టేసాడు. దీంతో లబోదిబో అంటున్నారు బాధితులు.

# ఏసిబికి చిక్కిన జీహెచ్ఎంసీ ఉద్యోగి

## లంచం తీసుకుంటుండగా పట్టివేత

హైదరాబాద్,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):

జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో అకౌంట్ సెక్షన్ విభాగంలో ఎగ్జామినర్‌గా పనిచేస్తున్న సూర్య వంశీ సంతోష్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సిటీ రేంజ్ 2 ఏసీబీ అధికారులు కార్యాలయంపై మెరుపు దాడి చేసి రూ.35 వేలు లంచం తీసుకున్న ఎగ్జామినర్‌ను పట్టుకున్నారు.రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతులను ఉన్నతాధికారులకు పంపాలని కోరగా అందుకు రూ.40 వేలు డిమాండ్ చేసి రూ.35వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. బాధితుడు చేసిన ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి ఎగ్జామినర్‌ను పట్టుకుని అరెస్టు చేసి నాంపల్లి కోర్టులో హాజరు పరుచగా జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు.

# మంగపేటలో అత్యధికంగా 39 డిగ్రీలు నమోదు

హైదరాబాద్,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):

తెలంగాణలో భానుడు భగభగమంటున్నాడు. పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. గురువారం ములుగు జిల్లా మంగపేటలో అత్యధికంగా 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్, జగిత్యాల, ఖమ్మంలో 38.9 డిగ్రీలు, మంచిర్యాలలో 38.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశముందని, వృద్ధులు, పిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

# టెన్త్ విద్యార్థులకు శుభవార్త

## హాల్ టిక్కెట్ చూపిస్తే ఉచిత ప్రయాణం

అమరావతి,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):

ఏపీలో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసీ తీపి కబురు చెప్పింది. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. హాల్ టికెట్ చూపిస్తే.. ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేలా వెసులుబాటు కల్పించింది. పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ బస్సుల్లో విద్యార్థులు ఈ సదుపాయాన్ని పొందవచ్చు. ఈ నెల 16 నుంచి ఏప్రిల్ 1 వరకు పదోతరగతి పరీక్షలు జరగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 6.42 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో పరీక్షలు జరిగే రోజుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతించాలని, తగినన్ని ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి ఆర్టీసీ ఎండీ ఆదేశాలు జారీ చేశారు.

# డోన్‌లో పర్యటించిన ఎమ్మెల్యే కోట్ల

కర్నూలు,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):

డోన్ నియోజకవర్గ శాసనసభ్యులు కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి గురువారం డోన్ పట్టణంలో పర్యటించారు. పలు ఫంక్షన్ హాళ్లలో జరిగిన వివాహ వేడుకలకు హాజరై సందడి చేశారు. నియోజకవర్గ ప్రజలతో మమేకమవుతూ, శుభకార్యాల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. పట్టణంలోని సాయి ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే, నూతన వధూవరులకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎం కన్వెన్షన్ హాల్ నందు జరిగిన వేడుకలో పాల్గొని, వధూవరులు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అదేవిధంగా వెంకటాచలం ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహ మహోత్సవానికి విచ్చేసిన ఆయన, కొత్త దంపతులను ఆశీర్వదించారు.

# మంత్రి అనితకు అస్వస్థత... ఆందోళన లేదన్న మంత్రి

అమరావతి,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):

రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అస్వస్థతకు గురయ్యారు. గురువారం అసెంబ్లీ సమావేశాలకు హాజరైన ఆమె కొంత అస్వస్థతకు గురయ్యారు. దీంతో అసెంబ్లీ ప్రాంగణంలో ఉన్న వైద్యులు.. అనితకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు బీపీ అధికంగా ఉందని గుర్తించారు. అనంతరం మెరుగైన వైద్య చికిత్స కోసం విజయవాడలోని ఆసుపత్రికి మంత్రి అనిత వెళ్లారు. అయితే తన అనారోగ్యంపై వస్తున్న వార్తలపై హోం మంత్రి అనిత స్పందించారు. తన ఆరోగ్యం బాగానే ఉందని స్పష్టం చేశారు. తన ఆరోగ్యంపై ఎవరు ఆందోళన చెందవద్దన్నారు. కొద్దిపాటి అలసట కారణంగా చిన్న ఇబ్బంది కలిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం తన ఆరోగ్యం బాగానే ఉందని హోం మంత్రి వంగలపూడి అనిత వివరణ ఇచ్చారు.

# ఖమేనీ మృతికి భారత్ సంతాపం

## రాయబార కార్యాలయంలో విక్రమ్ మిస్రీ సంతకం

న్యూఢిల్లీ,మార్చి5( మన నేషనలిస్ట్ వాయిస్ ):

ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మృతికి భారత్ సంతాపం తెలిపింది. ఈ మేరకు ఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయానికి వెళ్లిన భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ భారత్ తరఫున సంతాప సందేశాన్ని రాశారు. అనంతరం ఇరాన్ రాయబారితో మిస్రీ మాట్లాడారు. ప్రస్తుతం ఇరాన్‌లో నెలకొన్న పరిస్థితులపై వారు చర్చించారు. ఇటీవల ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ బలగాలు దాడిచేసి ఆ దేశపు సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీని హతమార్చాయి. దాంతో పొరుగు దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై, ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతిదాడులకు దిగింది. దాడులు, ప్రతిదాడులతో మధ్యప్రాచ్యం దద్దరిల్లుతోంది. ఈ నేపథ్యంలో ఇరాన్ ప్రపంచదేశాలకు చమురు సరఫరాలో జీవనాడి లాంటి హోర్ముజ్ జలసంధిని మూసివేసింది.

# విజిత్ రావు పరామర్శ

**దండేపల్లి మార్చ్-05( మన నేషనలిస్ట్ వాయిస్ )**

ఇటీవల అనారోగ్యనికి గురైనా కోలా సత్యనారాయణ ఆసుపత్రిలో చికిత్స అనంతరం దండేపల్లి మండలం నర్సాపూర్ గ్రామంలో తన స్వగృహంలో గురువారం వారిని పరామర్శించిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు నడిపేల్లి విజిత్ కుమార్ ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు అయన వెంట మండల పార్టీ అధ్యక్షులు చుంచు శ్రీనివాస్ మాజీ వైస్ ఎంపీపీ పాసర్తి అనిల్ పటేల్ యువజన విభాగం నాయకుడు గొల్లపెల్లి అజేయ్ కుమార్ ఉన్నారు



# భట్టి విక్రమార్క కొడుకు పెళ్లికీ హాజరైన బయ్యారం కాంగ్రెస్ నాయకులు

**బయ్యారం, మన నేషనలిస్ట్ వాయిస్ ,మార్చి 5.**

తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కొడుకు సూర్యవిక్రమాదిత్య-సాక్షి వివాహం హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. ఈ వివాహానికి బయ్యారం కాంగ్రెస్ పార్టీ నాయకులు నాయిని శ్రీనివాస్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తాటి జనార్ధన్,రామగిరి వెంకటేశ్వర్లు,ఆకునూరి సూర్యనారాయణ,నిమ్మల సోమిరెడ్డి, ఎరా హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన బయ్యారం సర్పంచ్

**బయ్యారం, మన నేషనలిస్ట్ వాయిస్ ,మార్చి 5.**

జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ను బయ్యారం సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ దంపతులు మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్బంగా బయ్యారం మండల కేంద్రంలో గల పలు సమస్యలు తీర్చాలని కలెక్టర్ దృష్టికీ తీసుకొచ్చారు.సమస్యలను సంబంధిత శాఖ అధికారులు త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని సర్పంచ్ శాంతికిషన్ నాయక్ తెలిపారు.



# స్పీడ్ బ్రేకర్లు వేయాలని విద్యార్థుల తల్లిదండ్రుల నిరసన

## ఆర్ అండ్ బి అధికారులు స్పందించి విద్యార్థుల భద్రత కోసం స్పీడ్ బ్రేకర్లు వేయాలి

**మన నేషనలిస్ట్ వాయిస్ /చిన్నశంకరంపేట మార్చి 5 గురువారం**

చిన్న శంకరంపేట మండలంలోని చెన్నాయపల్లి గ్రామంలో బీటీ రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు వేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. చేన్నాయపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల రోడ్డుకు దగ్గరగా ఉండి ప్రహరీ గోడ కూడా లేదు. రహదారిపై వాహనాలు స్పీడ్ గా వెళ్లడంతో గతంలో విద్యార్థులకు ప్రమాదాలకు గురైన సంఘటనలు కూడా ఉన్నాయి ఇదే రూట్ లో ఖాజాపూర్ గ్రామంలో కావేరి స్టీల్ కంపెనీ ఉండడంతో భారీ భారీ లారీలు కూడా వెళ్తూ ఉండడం జరుగుతుంది. కాబట్టి ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆర్ అండ్ బి అధికారులు స్పందించి ఈ రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు వేయాలని విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.ఈ నిరసన కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# లక్షెట్టిపేట మున్సిపాలిటీ లో అక్రమ వెంచర్ ల పై మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేసిన

## మాజీ కౌన్సలర్ లావుడ్య సురేష్ నాయక్

**లక్షేటీపేట్ మార్చ్ -05( మన నేషనలిస్ట్ వాయిస్ )**

ఎలాంటి అనుమతులు లేకుండా లక్షెటిపేట మున్సిపాలిటీ పరిధిలో 14 వ వార్డ్ లో అక్రమ వెంచర్ లు వేలేస్తున్నరాని లక్షేటీపేట్ మాజీ కౌన్సిలర్ లావుడ్యా సురేష్ నాయక్ గురువారం మున్సిపల్ కమిషనర్ కు పిర్యాదు చేశారు అనంతరం సురేష్ మీడియాతో మాట్లాడుతూ ఈ సమస్య పై అధికారులకు పిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని డి టి సి పి లేఔట్ ద్వారా ఉండాల్సిన అనుమతులు తుంగలో తొక్కుతూ ఇష్టానుసారంగా అనుమతులు ఇస్తున్న మున్సిపల్ అధికారులు డి టీ సీ పి ఏ లే ఔట్ అనుమతులు లేకుండా వేలేస్తున్న వెంచర్ లు పేరు కే టౌన్ ప్లానింగ్ అధికారి వారం లో రెండు రోజుల విధి నిర్వహణ,14 వ వార్డ్ గాంధీ చౌక్ ప్రాంతం లో పరంజ్యోతి హాస్పిటల్ ముందర 271,272 సర్వే నో లో మున్సిపాలిటీ రూల్స్ కు విరుధంగా ఉన్న కూడా అనుమతులు ఇవ్వేడం పై అధికారుల తీరు ఏవిధంగా ఉందో చూడండి డ్రైనేజ్. స్ట్రీట్ లైటింగ్ అనుమతులు లేకుండా అనుమతులు ఇస్తున్నారు అసలు మున్సిపల్ అధికారరుల ఏం చేస్తున్నట్టు అని తెలిసి అధికారి కను సైగలతో ఈ తతంగం నడుస్తుందా ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న అధికారులు పై చర్యలు తీసుకోవాలని కొత్తగా ఎన్నికైన మున్సిపల్ పాలకవర్గం అయినా ఈ తాతంగానికి చెక్కు పెడుతుందా ప్రజలను అక్రమ వసూళ్లు చేస్తున్న అధికారుల పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు లేని యెడల ఉద్యమం చెప్పడతామని హేచ్చరించారు






# విద్యార్థులు సేవా దృక్పథం కలిగి ఉండాలి

## - డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డి.రాజు

**బయ్యారం, మన నేషనలిస్ట్ వాయిస్ ,మార్చి 5.**

జాతీయ సేవా పథకం గార్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని బయ్యారం మండలం నామాలపాడు గ్రామంలో గురువారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డి.రాజు అధ్యక్షత నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్ ఎం.అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గారు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ద్వారా సేవా దృక్పథాన్ని అలవర్చుకోవలన్నారు. అదేవిధంగా నాయకత్వ లక్షణాలు విద్యార్థిని విద్యార్థులు పెంపొందించుకోవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ అనిల్ కుమార్ గారు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ కార్యక్రమం ద్వారా విద్యార్థిని విద్యార్థులు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబడతారని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వర్స దీపా ప్రకాష్ దొర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.పున్నమి చందర్,కళాశాల ఆధ్యాపకులు,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.




# తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఖమ్మం జిల్లా మీడియా ఇన్చార్జిగా మంద వెంకటేశ్వర్లు నియామకం

**ఖమ్మం బ్యూరో మన నేషనలిస్ట్ వాయిస్ మార్చి 05**



తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం ఖమ్మం జిల్లా మీడియా ఇన్చార్జిగా మంద వెంకటేశ్వర్లు ను నియమిస్తూ నియామక పత్రం అందజేసిన రాష్ట్ర చైర్మన్ డావచీమ శ్రీనివాస్ ఖమ్మంలో జరిగిన తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం జిల్లా కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర చైర్మన్ డావచీమ శ్రీనివాస్ తెలిపారు. తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం పాత కమిటీని రద్దుచేసి నూతన కమిటీని ఎన్నుకున్నారని. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులుగా డాక్టర్ పాలకుర్తి కృష్ణ ను మరియు వీరితోపాటు మరికొందరిని నియమిస్తూ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం పోరాటం చేసిన ఉద్యమకారులకు ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని కాలయాపన చేయకుండా వెంటనే అమలు చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం జిల్లా మీడియా ఇన్చార్జిగా నియామక పత్రం పొందిన మంద వెంకటేశ్వర్లు మాట్లాడుతూ. ఉద్యమ కారుల ఫోరం అభ్యున్నతి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం కోసం మీడియా ద్వారా తనవంతు కృషి చేస్తానని ఉద్యమ కారుల ఫోరం తనపై పెట్టిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని తెలియజేశారు.



# రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

## -కేవీకే మల్యాల శాస్త్రవేత్త డా.క్రాంతి కుమార్

**బయ్యారం, మన నేషనలిస్ట్ వాయిస్ ,మార్చి 5**

రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని కేవీకే మల్యాలకు చెందిన శాస్త్రవేత్త డా. క్రాంతి కుమార్ అన్నారు. గురువారం బయ్యారం మండలం కొత్తపేట గ్రామంలోని రైతు వేదికలో జాతీయ సహజ వ్యవసాయ మిషన్ పై అవగాహన కార్యక్రమం బయ్యారం మండల వ్యవసాయ అధికారి కే.రాజు అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కొత్తపేట సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్,డా. క్రాంతి కుమార్ ముఖ్య అతిథిగా హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ సహజ వ్యవసాయం,సేంద్రియ వ్యవసాయ పద్ధతులను రైతులు ఎక్కువగా అవలంబించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అధికారులు రైతులకు అందుబాటులో ఉన్న సదుపాయాల గురించి కొత్తపేట క్లస్టర్ రైతులకు వివరించారు.రైతులు అడిగిన వరి పంటలో కాండం పురుగు సమస్యతో పాటు ఇతర వ్యవసాయ సమస్యలపై ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి తగిన సూచనలు అందించారు. అనంతరం బయ్యారం మండల వ్యవసాయ అధికారి,రైతులతో కలిసి డా.క్రాంతి కుమార్ ని కోటగడ్డ గ్రామంలోని వరి పంట పొలాలకు తీసుకెళ్లి అక్కడ పంట పరిస్థితిని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జి.నాగరాజు,ఏఈఓ, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కళ్ళు పోతున్నాయి

## నరకంగా మారిన రాత్రి ప్రయాణం

## ప్రమాదాలకు ప్రధాన కారణం ఎల్ఈడీ లైట్లు

## సగం లైట్ స్టిక్కర్ నిబంధన జాడలేదు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మన నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి 05.**

కొత్తగూడెంలో రాత్రి 7గంటల తరువాత వాహనాలు నడపాలంటే భయమేస్తోంది. ఎదురొచ్చే వాహనాల ఎల్ ఈ డి లైట్స్ వల్ల కళ్లు కనిపించకుండ పోతున్నాయికొత్తగా వచ్చే వాహనాలు కొత్తగా ఎల్ఈడి లైట్స్ తో వస్తున్నాయి.ఆర్టీవో అధికారుల పర్యవేక్షణ కరువు. నియంత్రణ జాడ ఎక్కడ లేదు. గతం లో వాహనాల హెడ్ లైట్ కు సగం వరకు బ్లాక్ స్టిక్కర్ ఉండాలి అన్న నిబంధన ఉండేది.. ఆ రూల్ తీసేసారో ఉందో తెలీదు. ఎల్ఇడి లైట్ ల వలన ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక.కళ్ళు మసకబారి ఏమీ కనపడకుండా పోయి. ప్రమాదాలు జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి, కనుక సంబంధిత అధికారులు వాహనాల హెడ్ లైట్స్ ల కు వస్తున్న లేదు లైట్స్ గురించి చర్య తీసుకొని కనీసం హెడ్ లైట్ల కు సగం వరకు బ్లాక్ స్టిక్కర్ కానీ, బ్లాక్ పెయింట్ కానీ వేయాలనే రూల్ ను పునరుద్దరించాలి అని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



# సైబర్ నేరగాళ్ల 'మ్యూల్ అకౌంట్ల'పై పోలీసుల ఉక్కుపాదం

**కరీంనగర్, మన నేషనలిస్ట్ వాయిస్**

: తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ విభాగం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన లి'ఆపరేషన్ క్రాక్‌డౌన్'లిలో భాగంగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న వారిపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. కమీషన్లకు ఆశపడి తమ బ్యాంకు ఖాతాలను సైబర్ నేరగాళ్లకు అప్పగించిన మ్యూల్ అకౌంట్ దారులను కమిషనరేట్ వ్యాప్తంగా గుర్తించారు.

**ముఖ్య విషయాలు:**

మ్యూల్ అకౌంట్ల గుర్తింపు: కరీంనగర్ లోని నాలుగు ప్రధాన బ్యాంకుల్లో మొత్తం 34 మ్యూల్ ఖాతాలను పోలీసులు గుర్తించారు. ఇప్పటికే 162 వరకు చీజ్రా పోర్టల్ ద్వారా ఫిర్యాదులు అందినట్లు, ఈ ఖాతాల ద్వారా సైబర్ నేరగాళ్లు దాదాపు 1000కి పైగా అక్రమ లావాదేవీలు జరిపినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇప్పటివరకు ఈ వ్యవహారంలో 20 కేసులు నమోదు చేయగా, నిందితులపై కొత్త చట్టం సెక్షన్ 112 దీమీ ప్రకారం చర్యలు తీసుకోనున్నారు.

**నేరం జరిగే తీరు - సి.పి. హెచ్చరిక:**

ఈ సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ.. కొందరు వ్యక్తులు ఏజెంట్లు ఆశజూపే స్వల్ప కమీషన్లకు లోంగి, తమ వ్యక్తిగత బ్యాంకు ఖాతా వివరాలు, వాటికి లింక్ అయిన ఫోన్ నంబర్లను అపరిచితులకు అందజేస్తున్నారని తెలిపారు. సైబర్ నేరగాళ్లు బాధితుల నుండి దోచుకున్న సొమ్మును ఇతరుల ఖాతాల్లోకి (మ్యూల్ అకౌంట్లు) మళ్లించి, ఆపై తమ అవసరాలకు వాడుకుంటున్నారని వివరించారు. "తెలియని వ్యక్తులకు మీ బ్యాంకు ఖాతాలను అద్దెకు ఇవ్వడం లేదా వివరాలు చెప్పడం నేరం. అలా చేసిన వారిని సైబర్ నేరగాళ్లకు సహకరించిన నేరస్థులుగానే పరిగణిస్తామని సీపీ తెలిపారు.

**ప్రజలకు సూచనలు:**

అపరిచితులకు మీ బ్యాంకు ఖాతా, ఏటీఎం కార్డు, లేదా ఓటిపి (ర్యూ) వివరాలు ఎట్టిపరిస్థితుల్లోనూ ఇవ్వకండి.నెలవారీ కమీషన్లు ఇస్తామంటూ మీ ఖాతాను వినియోగించుకుంటామని వచ్చే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండండి.మీ ఖాతాలో






అనుమానాస్పద లావాదేవీలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించండి.బ్యాంకు అధికారుల సమన్వయంతో మ్యూల్ ఖాతాదారుల పూర్తి వివరాలు సేకరిస్తున్నామని, విచారణ వేగవంతం చేసి మిగిలిన నేరస్థులను కూడా త్వరలోనే పట్టుకుంటామని గురువారం కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలునందు జరిపిన సమీక్షా సమావేశంలో సీపీ స్పష్టం చేశారు.

# నేడు ఆదివాసీ పురోహిత్ పర్ధన్ సమాజ్ సంఘం సమావేశం విజయవంతం చేద్దాం

### మంచిర్యాల జిల్లా అధ్యక్షులు పెంద్రం తిరుపతి

**దండేపల్లి మార్చ్-05( మన నేషనలిస్ట్ వాయిస్ )**



ప్రాజెక్ట్ అధికారి ఐటీడిఏ ఉట్నూర్ తేదీ 06 -03 - 2026 శుక్రవారం రోజున ప్రాజెక్టు అధికారి ఛాంబర్ లో మధ్యాహ్నం 2 గంటలకు ఆదివాసీ పురోహిత్ పర్ధాన్ సమాజ్ సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు , కార్యవర్గ సభ్యులు మరియు జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు , కార్యవర్గ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించుటకు ప్రాజెక్ట్ అధికారి సమయం ఇవ్వడం జరిగింది ఇట్టి సమాచారాన్ని P O ITDA కార్యాలయం వారు ఆదివాసీ పురోహిత్ పర్ధన్ సమాజ్ సంఘానికి చేరవేయడం జరిగింది. కావున సంఘ రాష్ట్ర బాధ్యులు మరియు జిల్లా బాధ్యులు స్పందించి తేదీ 06 -03 -2026 నాటి సమావేశానికి హాజరై సమావేశన్ని విజయవంతం చేయాలనీ డా, మెస్రం మనోహర్ రాష్ట్ర అధ్యక్షులు మడావి శంకర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోరగా మంచిర్యాల జిల్లా నుండి అధిక సంఖ్యలో మన కులం వారు సమయానికి చేరుకొని విజయవంతం చేద్దామని మంచిర్యాల జిల్లా పురోహిత్ పర్ధన్ సంఘం అధ్యక్షులు పెంద్రం తిరుపతి పిలుపునిచ్చారు

# సుల్తానాబాద్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ తనిఖీ!

### - ఆసుపత్రిలో మందుల కొరత రాకుండా పటిష్ట చర్యలు!!

### - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**సుల్తానాబాద్, మార్చి-05 మన నేషనలిస్ట్ వాయిస్**

ఆసుపత్రిలో మందుల కొరత రాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సుల్తానాబాద్ లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆసుపత్రి ఓపి సేవలను పరిశీలించి డెంటల్ ఓపి కు వస్తున్న కేసులు , అందిస్తున్న చికిత్స గురించి వివరాలు తెలుసుకున్నారు. గర్భిణీ స్త్రీలకు రెగ్యులర్ హెల్త్ చెక్ అప్ షెడ్యూల్ ప్రకారం జరిగేలా చూడాలని, అవసరమైన వ్యాక్సినేషన్ వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు.రోగులతో ఆసుపత్రిలో అందుతున్న సేవల గురించి కలెక్టర్ ఆరా తీశారు. ఆసుపత్రి కి వచ్చిన పేషంట్ లతో మాట్లాడి ఎన్.సి.డి విభాగం, పరిశీలించి ఎట్టి పరిస్థితుల్లో మందుల కొరత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఆసుపత్రి ఆర్.ఎం.ఓ, సిబ్బంది,





# అక్రమ ఇసుక రవాణాను పూర్తిగా అణిచివేస్తాం - జిల్లా ఎస్పీ - సునిత రెడ్డి, ఐపీఎస్

### - ప్రకృతి సంపదల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### - వీపనగండ్ల తూముకుంట వాగు వద్ద 9 ట్రాక్టర్లు సీజ్ నిందితులపై కేసులు నమోదు


### - జిల్లాలో 3 రోజుల్లో 30 ఇసుక ట్రాక్టర్లపై కేసులు నమోదు


### - అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

**మన నేషనలిస్ట్ వాయిస్ వనపర్తి జిల్లా ప్రతినిధి**

వనపర్తి జిల్లాలో అక్రమ ఇసుక తవ్వకం, రవాణా చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష లేదు ఇసుక అక్రమ రవాణా చేసే వాహనాలను సీజ్ చేసి ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా అణిచివేస్తామని జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ఐపీఎస్., అన్నారు.లి వనపర్తి జిల్లా వీపనగండ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. తూముకుంట వాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో, జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ఐపీఎస్ ఆదేశాల మేరకు వనపర్తి సీఐ, సుగంధ రత్నం, వీపనగండ్ల ఎస్సై, రాణి, పోలీసులతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 9 ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొని స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు వనపర్తి జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ఐపీఎస్., తెలిపారు. గత మూడు రోజుల వ్యవధిలోనే జిల్లాలో 30 కేసులు నమోదు ఒక వీపనగండ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఇసుక 15 ట్రాక్టర్లపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూడ ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక అక్రమ తవ్వకం లేదా రవాణాకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తిస్తే ట్రాక్టర్లు, వాహనాలను తక్షణమే స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణాలో పాల్గొనే వారు వాహనాలు సీజ్ కావడం, కేసులు నమోదు కావడం వంటి తీవ్ర పరిణామాలు తప్పవని గుర్తుంచుకోవాలని సూచించారు. అక్రమ ఇసుక రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నామని, ఎవరు చట్టాన్ని అతిక్రమించినా కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు.ప్రకృతి సంపదలను అక్రమంగా దోచుకోవడం వల్ల పర్యావరణ సమతుల్యతకు తీవ్ర భంగం కలుగుతుందని,





భవిష్యత్ తరాలకు ప్రమాదకర పరిస్థితులు ఏర్పడే అవకాశముందని అందువల్ల ప్రజలు చట్టాలను గౌరవిస్తూ ఇసుక అక్రమ తవ్వకం, రవాణా వంటి అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా అక్రమ ఇసుక తవ్వకం లేదా రవాణా జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని, చట్ట అమలులో ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు. ప్రజల సహకారంతోనే అక్రమ ఇసుక రవాణాను పూర్తిగా అరికట్టగలమని ఆమె పేర్కొన్నారు.

# బాధితుడి ఇంటి వద్దకే పోలీసులు స్పాట్ లోనే ఎఫ్ఐఆర్ నమోదు ఎస్సై తిరుపతి

**బయ్యారం, మన నేషనలిస్ట్ వాయిస్ ,మార్చి 5.**

ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా, వెంటనే స్పందించి సహాయం అందుతుందని బయ్యారం పోలీసులు నిరూపించారు.వివరాల్లోనికి వెళితే ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పిర్యాదు ఇవ్వలేని స్థితిలో మండల కేంద్రంలో రాయల సతీష్ తీవ్ర గాయాలతో నడవలేని పరిస్థితిలో ఉండడంతో బాధితుడు ఒక్క ఫోన్ కాల్ తో జరిగిన సంఘటనపై దర్యాప్తు చేసి నిందితులపై బిఎన్ ఎస్ చట్టం కింద ఎఫ్ఐఆర్ కేసు నమోదు చేసి,ఎఫ్ఐఆర్ కాపీ ని బాధితుడికీ అందించారు.శాంతి భద్రతలను కాపాడేందుకు నిత్యం పనిచేస్తామని భరోసా కల్పించారు. బాధితుడి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని,న్యాయం ఆలస్యం కాకూడదనే ఉద్దేశంతో సంఘటన స్థలంలోనే ఆన్-సైట్ ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లలేని పరిస్థితిలో ఉన్నా కూడా ప్రజలు నిరాశ చెందాల్సిన అవసరం లేదని, పోలీసులు ప్రజల భద్రత కోసం మహబూబాబాద్ జిల్లా పోలీసులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని ఈ ఘటన ఉదాహరణ అని తెలిపారు. అవసరమైన సందర్భాల్లో పోలీసులు స్వయంగా ప్రజల వద్దకే వెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



# ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాల,అంగన్వాడి కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**బయ్యారం, మన నేషనలిస్ట్ వాయిస్ ,మార్చి 5.**

బయ్యారం మండలంలోని ఇర్సులాపురంలోని ఆశ్రమ పాఠశాల, అంగన్వాడి కేంద్రం,ప్రాథమిక పాఠశాలలను గురువారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాల,అంగన్వాడి కేంద్రంలలో స్టాక్, రిజిస్టర్,పిల్లలు,ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్,స్టోర్ గది,డైనింగ్ హాల్, కిచెన్ షెడ్,స్టడీ రూమ్,పరిసరాలను పరిశీలించారు.పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో షెడ్యూలు ప్రకారం పరీక్షలకు హాజరయ్యే విద్యార్థిని విద్యార్థులకు ఏలాంటి మానసిక ఒత్తిడి లేకుండా వారికి అర్థమయ్యే విధంగా నూతన డిజిటల్ తరగతులు ప్రాక్టికల్స్ ద్వారా విద్యను అందించాలని,పక్కాగా డైట్ మెనూ పాటించాలన్నారు.తద్వారా పిల్లలు మంచి వాతావరణంలో విద్యను కొనసాగించి ఉత్తమ ఫలితాలు సాధించుటకు ఉపయోగపడతాయన్నారు. ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు కచ్చితంగా సమయపాలన పాటించి సిలబస్ పూర్తి చేయాలన్నారు.ప్రతి విద్యార్థిని,గమనిస్తూ ఉండాలని, విద్యలో వెనుకబడిన పిల్లలను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించి ప్రోత్సహించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు పౌష్టిక ఆహారం అందిస్తూ వారికి అర్థమయ్యే రీతిలో పాఠాలను బోధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ అధికారి దేశీరాం నాయక్, స్థానిక తహసిల్దార్ నాగరాజు,ఎంపీడీవో దీపిక ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

**సుల్తానాబాద్, మార్చి-05 మన నేషనలిస్ట్ వాయిస్**

సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయంలో మీటింగ్ హల్ యందు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా పట్టణాలలో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న తొంభై తొమ్మిది రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఈనెల ఆరవ నుండి పన్నెండవ వరకు పట్టణంలోని వార్డుల వారిగా పరిసరాల పరిశుభ్రత,పెండింగ్ ఫైల్స్ పూర్తి చేయడం, సమ్మర్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా నీటి ఏద్దడి సమస్యలు పరిష్కరించుట, అమృత్ పైపు లైన్లు త్వరితగతిన పూర్తి చేయుట, చెరువులలో ఉన్నటువంటి ప్లాస్టిక్ వ్యర్థలను తొలగించుట,పబ్లిక్ టాయిలెట్లను,శుభ్రపరుచుటఇంటి పన్నుల వసూలు, కాలం చెల్లిన వాహనాలను ఇతర వస్తువులను తొలగించుటకు, మున్సిపాలిటీ చేపడుతున్న కార్యక్రమంలో కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధా కృష్ణ, వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత, వార్డు కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్ అసిస్టెంట్ ఇంజనీర్ రాజ్ కుమార్ తో పాటు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..





PRINTED AND PUBLISHED by VASISTA PRINTERS 18-97, 306, 3RD FLOOR, RAJINIGANDHA COMPLEX, KAMALA NAGAR, CHAITANYAPURI, SAROORNAGAR, RANGAREDDY, TELANGANA - 500060, RNI No :TGTEL/25/A4284 EDITOR KOMMU SRINIVAS, Contact - 9666023180 & 8096660656